Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



ఏలూరు ELURU | సంపుటి : 03 | సంచిక : 10 | బుధవారం | నవంబర్ 11, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 10 | Wednesday | 11 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



ఏపీ వైపు మరో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన
- ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం
- 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం
- దక్షిణ కోస్తా రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- నవంబర్ 14 మరియు 15 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- తెలంగాణలో క్రమంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 13న కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఏర్పడిన 24 గంటల్లోనే మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా, ఆపై వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

2 లో



ప్రపంచ సంక్షోభాల్లో భారత్ వైపే చూపు..

మోదీ నాయకత్వంపై బీజేపీ వ్యాఖ్యలు

- మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందన్న బీజేపీ
- గత 12 ఏళ్లలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడి
- విదేశాంగ అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలన్న కాంగ్రెస్
- భారత్-ఉక్రెయిన్ సంబంధాల బలోపేతంపై జెలెన్స్కీ-మోదీ చర్చ
- శాంతియుత పరిష్కారానికి సహకరిస్తామని మోదీ హామీ

2 పేజీలో..

న్యూఢిల్లీ : ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అందరి దృష్టి భారత్‌పైనే ఉంటోందని బీజేపీ పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందని తెలిపింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్

సోనియా గాంధీ పుస్తకంపై బీజేపీ ఫైర్..

అది ఆత్మకథ కాదు 'వైట్‌వాషింగ్'

- సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'పై బీజేపీ తీవ్ర విమర్శలు
- గాంధీ కుటుంబ చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నమే ఈ పుస్తకమని ఆరోపణ
- ఎమర్జెన్సీని పారపాటుగా చెప్పి దాన్ని సాధారణీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శ
- బాబ్రీపై పడ్డిన సోనియా.. సిక్కుల ఊచకోతపై ఎందుకు కన్నీరు పెట్టలేదని బీజేపీ ప్రశ్న
- నట్వర్ సింగ్ పుస్తకం విడుదలకు ముందు ఆయనను ఎందుకు కలిశారో చెప్పాలని డిమాండ్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్లమెం టరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'పై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ పుస్తకం నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చి, వారి పాపాలను శుభ్రపరిచే ఒక 'వైట్‌వాషింగ్' ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు.

2 లో



పెట్టుబడుల పండుగకు విశాఖ సిద్ధం

12, 13వ తేదీల్లో సాగర తీరాన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026

- విశాఖకు ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి...పలువురితో భేటీలు
- విదేశీ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలతో సమావేశం కానున్న సీఎం
- ప్రపంచ నలుమూలల నుంచి పారిశ్రామిక దిగ్గజాల రాక
- సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల ప్రతినిధుల భాగస్వామ్యం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఏపీని పెట్టుబడులకు, పారిశ్రామికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను ప్రభుత్వం నిర్వహించనుంది. గతేడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు భిన్నంగా 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఇప్పటికే ఐదు ప్రాంతీయ సదస్సులు నిర్వహణతో రూ.86 వేల కోట్ల పెట్టుబడులను వచ్చాయి. అలాగే వివిధ రంగాలపై ప్రాంతీయ సదస్సుల్లో చర్చలు జరిగాయి. దీంతో పెట్టుబడుల సదస్సులో ఎలాంటి చర్చలు జరుగుతాయో ననే అంశంపై అందరిలోనూ ఆసక్తిని రెకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తం గా చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, దౌత్యనేత్తలు, ప్రముఖ పారిశ్రామి కవేత్తలు, బహుళజాతి సంస్థల అధినేత లు హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని, వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామిక సంస్థల అధినేతలతో సమావేశం కానున్నారు.

2 పేజీలో..



పీవీ సింధుకు అరుదైన గౌరవం..

అభినందనలు తెలిపిన మాజీ సీఎం జగన్

- ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పీవీ సింధు
- ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి సింధు అని ప్రశంస
- తెలుగు రాష్ట్రాలకు ఇది గర్వకారణమని పేర్కొన్న మాజీ ముఖ్యమంత్రి
- క్రీడాకారుల వాణిని వినిపిస్తారని జగన్ ఆశాభావం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధుకు అరుదైన గౌరవం దక్కింది. భారత ఒలింపిక్ సంఘం అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

2 పేజీలో..

ఎంపీపీలు, జెడ్పీటీసీల పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ


ఈ నెల 19న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు

- 20న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు
- 659 మండల పరిషత్‌లు, 28 జిల్లా పరిషత్‌లలో పరోక్ష ఎన్నికల నిర్వహణ



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ : రాష్ట్రవ్యాప్తంగా మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) సభ్యుల ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 05.11.2026న నిర్వహిం చింది. అయితే తుపాను ప్రభావం కారణంగా తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి, ఏలూరు జిల్లాలో నాలుగు మండలాల్లో మొత్తం ఐదు మండలాలకు సంబంధించి పోలింగ్‌ను ఈ నెల 06.11.2026కు వాయిదా వేసి నిర్వహించడం జరిగింది. అదేవిధంగా, ఈ నెల 05.11.2026న జరిగిన పోలింగ్‌లో కొన్ని ఎన్నికల అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఐదు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 06.11.2026న రీపోలింగ్ నిర్వహించారు.

2 లో..



ఏపీ కేబినెట్ నిర్ణయాలు..

- పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: ఆం ధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది.

- మిగతా 2లో..

తండ్రి పేరు తప్పనిసరి

- తండ్రి పేరు లేని కారణంగా ఏ చిన్నారికీ విద్య, సంక్షేమ పథకాలు, గుర్తింపు పత్రాలు, ఇతర సేవలు దూరం కాకూడదు
- పిల్లల హక్కులు, గౌరవం, సమానత్వం, వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ శాఖలు విధివిధానాలను రూపొందించాలి
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ : ప్రభుత్వ శాఖల దరఖాస్తులు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో చట్టపరంగా తప్పనిసరి కాని సందర్భాల్లో తండ్రి పేరు నమోదు చేయాలనే నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (AP SCPCR) పిలుపునిచ్చింది. తండ్రి వివరాలు లేవనే కారణంతో ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇతర అత్యవసర సేవలు అందకుండా చేయకూడదని స్పష్టం చేసింది.



విజయవాడ స్వర్ణ ప్యాలెస్ లో మంగళవారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన 'తండ్రి పేరు తప్పనిసరి నిబంధనను తొలగించడం' అనే అంశంపై ఒకరోజు రాష్ట్రస్థాయి కార్యశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న AP SCPCR చైర్మన్ వెటుకూరి

ప్రజాభూమి
బుధవారం, నవంబర్ 11, 2026



ప్రపంచ సంక్షోభాల్లో భారత్ వైపే చూపు..

జెలెన్‌స్కీతో మోదీ ఫోన్‌లో మాట్లాడిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో భారత ప్రతిష్ఠను మోదీ పెంచారని అన్నారు. ప్రపంచంలో ఏ సంక్షోభం తలెత్తినా, రెండు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు ఏర్పడినా అంతర్జాతీయ సమాజం భారత్ వైపు చూస్తోందని చెప్పారు. జెలెన్‌స్కీతో తాజా సంభాషణ దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.అయితే ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ భిన్నంగా స్పందించారు. అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ఉన్న స్థానం దృష్ట్యా ఇలాంటి అంశాలపై చాలా జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. జెలెన్‌స్కీతో సోమవారం ఫోన్‌లో మాట్లాడిన వివరాలను మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత్-ఉక్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం, మానవతా సమస్యలు, శాంతి ప్రయత్నాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా భారత్ అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు, అబుదాబిలో జరగనున్న శాంతి చర్చలకు ముందు తాజా పరిణామాలను మోదీకి వివరించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. చర్చల కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని చెప్పారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు రష్యా కూడా ముందుకు రావాలని కోరారు. యుద్ధాన్ని కొనసాగించడం కంటే ముగించడమే ముఖ్యమని మోదీ గతంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పారని గుర్తుచేశారు.



పీవీ సింధుకు అరుదైన గౌరవం..

ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నారు.ఈ అత్యున్నత పదవిని చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా పీవీ సింధు నిలవడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఇది మన ప్రాంతానికి దక్కిన గొప్ప గౌరవమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని క్రీడాకారుల వాణిని సింధు సమర్థవంతంగా వినిపిస్తారన్న విశ్వాసం తనకు ఉందని ఆయన తెలిపారు. భారత క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆమె తన వంతు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు జగన్ పేర్కొన్నారు. ఈ నూతన బాధ్యతల్లో గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సింధుకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీ కేబినెట్ నిర్ణయాలు..

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏపీజీసీ-ఎక్స్‌ఆర్ (AVGC-XR) పాలసీ 2026-31, ఏపీ రోబోటిక్స్ - ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు. మరోవైపు, రాష్ట్రంలో రోడ్ల భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.




ఏపీ వైపు మరో అల్పపీడనం..

అనంతరం ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం : ఈ అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే భారీ వర్షాల కంటే ఎక్కువగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

తుపానుగా మారే అవకాశం తక్కువే : ప్రస్తుత సమాచారం



ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఇటీవలే వచ్చిన అర్నబ్, మురసు తుపానుల ప్రభావంతో రాష్ట్రంలో పంటలు, రహదారులు, విద్యుత్ స్తంభాలకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో అధికారులు తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో మరిన్ని తుపానులు లేదా తీవ్ర అల్పపీడనాలు ఏర్పడే పరిస్థితులు లేకపోలేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మత్స్యకారులకు హెచ్చరికలు : తాజా అల్పపీడన పరిణామాలతో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వాతావరణం అలజడిగా మారనుంది. సముద్రంలో అలల ఉద్ధృతి పెరగడంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 14, 15 తేదీల్లో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని విపత్తు నిర్వహణ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలో పెరుగుతున్న చలి : మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. సోమవారం రాత్రి రాష్ట్రంలోని దాదాపు 16 జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 14.7 డిగ్రీల నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 14.7 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ అల్పపీడనం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందున, దాని గమనం మరియు తీవ్రతలో మార్పులు జరిగే అవకాశం ఉంది. పరిస్థితిని బట్టి వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తాజా బులెటిన్ల ద్వారా స్పష్టత ఇవ్వనుంది.

పెట్టుబడుల పండుగకు విశాఖ సిద్ధం

నవంబర్ 12వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో సదస్సు ప్రారంభ కార్యక్రమం జరగనుంది. సదస్సు ప్రారంభ కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఆ తర్వాత జరగనున్న వివిధ సెషన్లు... సమావేశాల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు భాగస్వాములు కానున్నారు. అలాగే కీలక సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొని... ఆయా అంశాలపై చర్చించడంతోపాటు... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక విధానాలు, తయారీ, సాంకేతిక రంగాల్లోని అవకాశాలను పారిశ్రామిక వర్గాలకు సీఎం వివరిస్తారు.

అంతర్జాతీయ ప్రతినిధులతో ముఖ్యమంత్రి భేటీలు

సీఐఐ సమ్మిట్‌లో భాగంగా ముఖ్యమంత్రి పలు దేశాల మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, స్లోవేకియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో సీఎం భేటీ కానున్నారు. అలాగే జపాన్, రష్యా రాయబారులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. వీరితో పాటు ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్‌తో కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇక సదస్సులో ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, నిర్మాణ సామగ్రి, మౌలిక సదుపాయాలు, మాన్యుఫ్యాక్చరింగ్, సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులు భాగస్వాములు కానున్నారు. కియా మోటార్స్‌కు, రెన్యూ, మాండెలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు సదస్సులో భాగస్వాములు కానునున్నారు. ఇక సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా స్పేస్ రంగంలోని స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు నిలవనున్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, తయారీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను విస్తరించే లక్ష్యంతో తేదీన ప్రముఖ భారతీయ ప్రైవేటు అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో హాథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. అలాగే జపాన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ చైర్మన్‌తో సీఎం భేటీ అవుతారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలోనే మహిళా సాధికారతకు ప్రాధాన్యతిస్తూ ఓ సమావేశం నిర్వించనున్నారు. దీనికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. 'విమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్--2026' పేరుతో విశాఖ నోవోటెల్‌లో ప్రారంభ కార్యక్రమం జరగనుంది. మహిళల ఆర్థిక సాధికారత, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, వ్యాపారవేత్తలుగా మహిళలకు ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించనున్నారు.

కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి వరుస భేటీలు

సదస్సులో వివిధ శాఖలకు చెందిన కేంద్రమంత్రులతో సీఎం ఈ రెండు రోజుల్లో సమావేశం కానున్నారు. వివిధ రంగాల్లో పారిశ్రామికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు... రాష్ట్రానికి అందించాల్సిన చేయూతపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. అలాగే రాష్ట్రంలోని వివిధ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా కొన్ని వెసులుబాట్లు కల్పించే అంశాలను కేంద్రమంత్రుల వద్ద ప్రస్తావించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తలెత్తుతున్న పరిణామాలతో రాష్ట్రంలోని పలు రంగాలపై పడుతున్న ప్రభావాన్ని కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్ వంటి వారితో సీఎం భేటీ కానున్నారు.

ఒకరోజు ముందే సీఎం సమావేశాలు

సమ్మిట్‌కు ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో అమరావతి, విశాఖల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. బుధవారం సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో అమరావతిలో సమావేశమవుతారు. అనంతరం విశాఖ చేరుకుని వివిధ భేటీల్లో పాల్గొంటారు. డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ, రెన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాలతో బుధవారమే సమావేశం కానున్నారు. బుధవారం సాయంత్రం సీఐఐ సీఈవోలతో సమావేశం, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన స్వాగత విందులో పాల్గొంటారు.

సోనియా గాంధీ పుస్తకంపై బీజేపీ ఫైర్..

తాజాగా ఈ పుస్తకం విడుదలైన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.
తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటని, చివరికి ఆమె కూడా అదే అభిప్రా యానికి వచ్చారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఇందిర తన చిన్న కుమారుడు సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, జరిగిన నష్టంలో చాలా వరకు నివారించి ఉండేవారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలను కేశవన్ తోసిపుచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలను అంగీకరించకుండా, దాన్ని ఒక సాధారణ పొరపాటుగా చిత్రీకరించి, సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.పుస్తకంలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన గురించి ప్రస్తావిస్తూ తాను ఏడ్చానని సోనియా చెప్పడాన్ని కేశవన్ తప్పుబట్టారు. "బాబ్రీ మసీదు కోసం కన్నీళ్లు పెట్టుకున్న సోనియా గాంధీ, కాంగ్రెస్ హయాంలో 1984లో జరిగిన సిక్కుల ఊచకోతలో వేలాది మంది అమాయకులు చనిపోయినప్పుడు కనీసం ఒక్క కన్నీటి చుక్కైనా కార్చారా?" అని ఆయన ప్రశ్నించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి గురించి ఎప్పుడైనా బాధపడ్డారా అని నిలదీశారు.
ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ ఆత్మకథ విడుదలకు ముందు జరిగిన పరిణామాలను కూడా కేశవన్ గుర్తుచేశారు. "2014లో నట్వర్ సింగ్ తన ఆత్మకథ 'వన్ లైఫ్ ఈజ్ నాట్ ఎనఫ్' విడుదలకు ముందు సోనియా గాంధీ ఆయన్ను ఎందుకు కలిశారు? 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జరిగిన పరిణామాల గురించి నట్వర్ సింగ్ ఏం రాస్తారోనన్న భయంతోనే ఆయన్ను కలిశారా? ఈ విషయాలపై తన పుస్తకంలో సోనియా స్పష్టత ఇస్తారా?" అని కేశవన్ ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలిగించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ చారిత్రక తప్పిదాలను సరిదిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎంపీపీలు, జెడ్పీటీసీల పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ

రాష్ట్రంలోని అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఈ నెల 07.11.2026న ఓట్ల లెక్కింపు చేపట్టి, ప్రక్రియ పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటించడం జరిగింది.ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 659 మండల ప్రజా పరిషత్‌ల (ఎంపీపీలు)లో కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు, 28 జిల్లా ప్రజా పరిషత్‌ల (జెడ్పీపీలు)లో కో-ఆప్టెడ్ సభ్యులు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రోజు (10.11.2026) నోటిఫికేషన్లు జారీ చేసింది.ని ప్రకారం ఎంపీపీలలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు ఈ నెల 19.11.2026న, జెడ్పీపీలలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు ఈ నెల 20.11.2026న సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నారు. ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అదేవిధంగా, ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు.ప్రతి ఎంపీపీలో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జెడ్పీపీలో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు, జెడ్పీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కంటే ముందుగా



కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికను నిర్వహించాలి. ఈ సభ్యులు మతపరమైన మైనారిటీ లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందినవారై ఉండాలి.11.03.1995 న జారీ చేసిన జీ.ఓ.ఎం.ఎస్. నెం.131, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సహాయ శాఖ (ఎన్నికలు-IV) ప్రకారం మతపరమైన మైనారిటీలలో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్లు (పార్సీలు) ఉంటారు. తెలుగు మాతృభాష కాని ఇతర భాషలను మాతృభాషగా కలిగిన వారిని భాషాపరమైన మైనారిటీలుగా పరిగణిస్తారు. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, జెడ్పీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు జరిగే ఎన్నికలను చేతులు పైకెత్తి ఓటు వేసే (హ్యాష్‌శీఎ శీట ఱుఅఎం) విధానంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సంబంధిత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సభ్యులకు జారీ చేసే పార్టీ విప్‌ను తప్పనిసరిగా పాటించాలి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలకు సంబంధించి పార్టీ విప్ జారీ చేసే నిబంధన లేదు.సంబంధిత మండల, జిల్లా పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు (ఎంపీలు), శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు), శాసనసభ సభ్యులు (ఎమ్మెల్యేలు) కూడా ఈ ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యేందుకు ఆహ్వానించబడతారు. అయితే ఈ ఎన్నికల్లో వారికి ఓటు వేసే హక్కు ఉండదు.నిర్దిత షెడ్యూల్ ప్రకారం, ఎంపీపీలకు ఈ నెల 19.11.2026 న, జెడ్పీపీలకు ఈ నెల 20.11.2026న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14.11.2026లోగా అందజేయనున్నారు. పరోక్ష ఎన్నికల ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వివరణాత్మక విధివిధానాలు, మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన రెండు నోటిఫికేషన్లు, విధివిధానాలకు సంబంధించిన సూచనల ప్రతులను సమాచార నిమిత్తం జతపరచడమైనది.

తండ్రి పేరు తప్పనిసరి

ఏ.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ... ప్రతి చిన్నారికి స్వతంత్ర హక్కులు, గౌరవం, గుర్తింపు ఉంటాయని, తల్లిదండ్రుల వైవాహిక స్థితి, కుటుంబ పరిస్థితులు, సామాజిక నేపథ్యం ఆధారంగా పిల్లల భవిష్యత్తు నిర్ణయించరాదని పేర్కొన్నారు. పిల్లల గౌరవం, సమానత్వం, వ్యక్తిగత గుర్తింపు, ప్రాథమిక హక్కులకు ప్రభుత్వ పరిపాలనా విధానాల్లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల కన్వెన్షన్ (UNCRC) లోని ఆర్టికల్స్ 2, 3, 7, 8, 12, 16, 28లను ప్రస్తావిస్తూ... వివక్షకు తావులేకుండా చూడటం, బాలల సంక్షేమానికి ప్రాధాన్యత, గుర్తింపు హక్కు, అభిప్రాయ వ్యక్తీకరణ, వ్యక్తిగత గోప్యత, విద్యా హక్కులను ఈ నిబంధనలు పరిరక్షిస్తున్నాయన్నారు. ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బాధితులు, చట్టబద్ధ సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు ప్రభుత్వ దరఖాస్తుల్లో తండ్రి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలనే నిబంధన కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చైర్మన్ పేర్కొన్నారు. తండ్రి పేరు తప్పనిసరి చేయడం వల్ల జనన ధ్రువీకరణ పత్రాలు, పాఠశాలల్లో ప్రవేశాలు, ఉపకార వేతనాలు, గుర్తింపు పత్రాలు, సంక్షేమ



పథకాల ప్రయోజనాలు పొందడంలో అనవసరమైన అడ్డంకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. కొన్ని సందర్భాల్లో తల్లులు తమ కుటుంబ పరిస్థితులను పదేపదే వెల్లడించాల్సి రావడం, అర్హత నిరూపించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వ దరఖాస్తులు, రికార్డులు పిల్లలకు హక్కులు, సేవలు అందించే మార్గాలుగా ఉండాలే తప్ప, వారి అభివృద్ధికి అడ్డంకులుగా మారకూడదని స్పష్టం చేశారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
బుధవారం, నవంబర్ 11, 2026

ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

- ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలి
- పోలింగ్ సామగ్రి పంపిణీ, బ్యాలెట్ బాక్సుల తనిఖీ, పోలింగ్ ప్రక్రియలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి
- ఎన్నికల విధుల నిర్వహణలో 100 శాతం అంకితభావం, బాధ్యతతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి,

మచిలీపట్నంః రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నిక లను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, విధివిధానాలను ప్రతి అధికారి తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు.గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు, స్టేజ్–2 రిట ర్నింగ్ అధికారులకు మంగళవారం ఉదయం 9 గంటలకు మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆద్యంతం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులను ఉద్దేశించి ఆయన పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.నామినేషన్ల స్వీకరణ నుంచి తుది జాబితా వరకు అప్రమత్తత అవసరంస్టేజ్–1 రిట ర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణ నుంచి తుది పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రచురించే వరకు ప్రతి దశలో ఎన్నికల కమి షన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయా లన్నారు. ప్రతి అధికారి తప్పని సరిగా చెక్‌లిస్ట్‌ను అనుస రిస్తూ అందులో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.ముఖ్యంగా నామినేషన్ పత్రాల్లో పొందుపరచాల్సిన తప్పనిసరి వివరాలు, ధ్రువ పత్రాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని అభ్యర్థులు సక్రమంగా సమర్పించేలా ముందుగానే వారికి స్పష్ట మైన అవగాహన కల్పించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దిష్ట గడువులో అన్ని చర్యలు పూర్తి చేయాలని సూచించారు."

పోలింగ్ సామగ్రి పంపిణీలో ప్రతి అంశాన్ని తనిఖీ చేయాలి

స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని స్వీకరించే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. చెక్‌లిస్ట్‌లో పేర్కొన్న ప్రతి అంశాన్ని పరిశీలించి, అన్ని సామగ్రి సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే స్వీకరించాల న్నారు.ముఖ్యంగా బ్యాలెట్ బాక్సులు సక్ర మంగా పనిచేస్తున్నాయా లేదా, బ్యాలెట్ పేపర్లు సీరియల్ క్రమంలో ఉన్నాయా లేదా, వాటి నాణ్యత సరిగ్గా ఉందా లేదా అనే అంశాలను క్షు ణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చిరిగిన, దెబ్బతిన్న బ్యాలెట్ పేపర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించ కుండా వాటి స్థానంలో నాణ్యమైన బ్యాలెట్ పేపర్లను తీసుకోవాలని స్పష్టం చేశారు.స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డుల జారీ, వారికి కేటాయించిన స్థానాల్లో కూర్చునేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

పోలింగ్ సామగ్రి, బ్యా లెట్ బాక్సులు తీసుకుని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బయలుదేరిన తర్వాత సిబ్బంది మధ్యలో ఎక్కడా దిగకుండా నేరుగా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు మాత్రమే చేరుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల ఏర్పాట్లలో ముందస్తు ప్రణాళిక, పర్యవేక్షణ తప్పనిసరిఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎంపీడీవోలు, డీఎల్ డీవోలు ముందస్తు ప్రణాళికతో ప్రతి ఏర్పాటును స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల హ్యాండ్‌బుక్‌లో పేర్కొన్న నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి అంశాన్ని ముందుగానే ఊహించి (విజుయలైజ్), అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని ఆదేశించారు.ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి 100 శాతం ఏకాగ్రతతో, పూర్తి బాధ్యతాయుతంగా, అంకిత భావంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించకుండా ప్రతి పనిని అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా తప్పిదాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికలను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారి బాధ్యత అని, ముందస్తు సన్నద్ధత, సమన్వయం, నిబద్ధతతో పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ

ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, జాయింట్ కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, డీఆర్డీఏ పీడీ మరియు ఎన్నికల నోడల్ అధికారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ అనంతరం ఎన్నికల అధికారులు తమకు ఎదురైన సందేహాలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వారు వాటికి సమగ్రంగా సమాధానాలు ఇచ్చి అవసరమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజన్ ఆర్డీఓ, డీఎల్‌డీఓ, డీఎల్‌పీఓ, తహ సీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంపీడీవో కార్యాలయాల ఎన్నికల కేస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



వాట్సాప్లో ఫోటోలకే స్పందించిన అటవీ శాఖ అధికారులు

వాకర్స్ కాలి బాట ఆటంకాలు తొలిగింపు
అటవీ శాఖ అధికారులకు నగర వనం వాకర్స్ కృతజ్ఞతలు





ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ఏదైనా పని జరగాలంటే ప్రభుత్వ అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన రోజులు ఇవి. కానీ ఒక్క వాట్సాప్ ఫోటోలు పంపించిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేసిన అటవీ శాఖ అధికారులు తమ పని తనాన్ని చాటు కొన్న వైనమిది. విజయవాడకి కూత వేటు దూరంలో ఉన్న అటవీ శాఖ ఆధ్వర్యంలో సుమారు 11 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన నగరవనం లో పార్కు, వాకింగ్ ట్రాక్ని నిత్యం వందలాది మంది ఉపయోగించు కొంటూ తమ ఆరోగ్యం కాపాడు కొంటున్నారు. అలాగే పార్క్ లో ఏర్పాటు చేసిన అట వస్తువులు ఎంతో మందికి ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. వ్యాయామ పరికరాలు ఆరోగ్యాని కాపాడుతున్నాయి. ఇటీవల వరస తుఫాన్ వల్ల వాకర్స్ కానీ పార్క్ సందర్శకులు గానీ నగరవనం కి రావడం తగ్గింది. దాంతో వాకర్స్ కాలి బాటలో పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి కాలిబాట మూసుకుపోయింది. అవాంతరాల ఫొటోలు వాకర్స్ అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి పులిపర్తి పోతురాజు వాట్సాప్ కి పోస్ట్ చేయడంతో వెంటనే స్పందించిన పోతురాజు ట్రాక్టర్ బ్లేడుతో పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు తొలిగింపు చర్యలు కార్యరూపంలో చేపట్టి అవాంతరాలు లేకుండా చేశారు. కేవలం వాట్సాప్ సమాచారం తో స్పందించిన పోతురాజు కి వాకర్స్, నగరవనం సందర్శకులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో విజేత గీత్ చరణ్‌కు సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ఇటీవల జరిగిన మచిలీపట్నం మున్సిపాలిటీ కార్పొరేషన్ 1వ డివిజన్ కు జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున (జనరల్ సీటు) పోటీచేసి విజయం సాధించిన మచిలీపట్నం నియోజకవర్గం సీనియర్ ఎస్సీ నాయకులు వంపుగడవల చౌదరి తనయుడు గీత్ చరణ్ అత్యధిక ఓట్లతో గెలిచిన సందర్భంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజస్టర్ నెం.118/2025) కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు కలసి తండ్రి కొడుకులను అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగినది. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు గంటా వెంకటేశ్వర రావు, జిల్లా అధ్యక్షులు మద్దాల కృష్ణ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసనం క్రాంతి కుమార్, జిల్లా ట్రెజరర్ కొండ్రు రాజు, జిల్లా ఉపాధ్యక్షులు మేడేపల్లి నాగేశ్వర రావు, గరికిముక్కు జయరాజు, జాయింట్ సెక్రటరీ యేలేటి హనుమంతరావు, పాతపాటి గోపాల కృష్ణ, కోసూరు మాజీ సర్పంచ్ దగాని సుబ్బారావు, సీనియర్ దళిత నాయకులు మరియు వైసీపీ నేత మద్దాల వీరాస్వామిలు అభినందించారు.

కరాటే పోటీల్లో నిర్మల పాఠశాల విద్యార్థినికి ప్రథమ బహుమతి

25వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన చిన్నం నవరత్న జ్యోతి



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

విజయవాడలో నిర్వహించిన 25వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో మచిలీపట్నంలోని నిర్మల పాఠశాలకు చెందిన ఆరో తరగతి 'ఏ' సెక్షన్ విద్యార్థిని చిన్నం నవరత్న జ్యోతి ప్రథమ బహుమతి సాధించి ప్రతిభ చాటింది. విజయవాడలోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడ మీలో రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహించిన ఈ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో భాగంగా 11 ఏళ్ల బాలికల బ్లూ బెల్ట్ కేటగిరీలో నవరత్న జ్యోతి అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం నవరత్న జ్యోతికి ట్రోఫీతో పాటు 25వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించింది. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న వయస్సులోనే క్రీడారంగంలో ప్రతిభ చాటుతూ ప్రథమ బహుమతి సాధించడం పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు.

సత్వర సమస్యల పరిష్కారానికి "మీ కోసం"

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

నగర పరిధిలో తాగునీటి సమస్యలు, పరిసరాలు అపరిశుభ్రత, కాలువలు శుభ్రం చేయక పోవటం, వీధి దీపములు వెలుగక పోవటం, రోడ్డు మీద ఆక్రమణల సమస్య మొదలైన నగరపాలక సంస్థకు చెందిన సమస్యలు ఎదురైనప్పుడు మచిలీపట్నం నగరపాలక సంస్థ "మీ కోసం" విభాగమునకు 9849907989 కు ఫోన్ చేసి తెలియజేయవలసినదిగా మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు.ఉదయం గం.6.00 ల నుండి సాయంత్రం గం. 8.00 ల వరకు ఫోన్ ద్వారా గానీ, నగరపాలక సంస్థ "మీ కోసం" విభాగమునకు వినతి పత్రము ఇవ్వడం ద్వారా గానీ మీ సమస్యలను తెలియపరచుచునని. సదరు సమస్యల పరిష్కారమునకు చర్యలు గైకొన బడునని. సంవత్సరములోని అన్ని దినములలో "మీ కోసం" విభాగము ఉదయం ఆరు (6) గంటల నుండి రాత్రి ఎనిమిది (8) గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు.అదే విధముగా సంవత్సరములోని అన్ని రోజులు అనగా 365 రోజులు కూడా మున్సిపల్ రెవెన్యూ కౌంటర్లు ఉదయం ఆరు (6) గంటల నుండి రాత్రి ఎనిమిది (8) గంటల వరకు నిరంతరాయముగా పనిచేస్తాయని తెలిపారు. మధ్యాహ్నం భోజన విరామ సమయములో కూడా పని చేయునని. ఇంటి పన్ను (ఆస్తి పన్ను), ఖాళీ స్థలము పన్ను, వాటర్ చార్జెస్ మొదలైనవి మచిలీపట్నం నగరపాలక సంస్థలోని మున్సిపల్ రెవెన్యూ కౌంటర్ల నందు చెల్లించవచ్చునని. ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోవలసినదిగా నగర ప్రజలను మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ కోరారు.

రైతులకు అండగా కృష్ణా డీసీసీబీ రూ.1 కోటి విరాళం

మాజీ మంత్రి, కృష్ణా డీసీసీబీ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నెట్టెం శ్రీ రఘురాం, మంత్రి కొల్లు రవీంద్ర ఆప్కాబ్ చైర్మన్ గన్నీ వీరాం జ నేయులు కలిశారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా నిలిచేందుకు కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కృష్ణా డీసీసీబీ) తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1 కోటి విరాళం అందించే కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్, మాజీ మంత్రివర్యులు నెట్టెం రఘురాం పాల్గొన్నారు.

అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి నెట్టెం రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణా డీసీసీబీ కామన్ గుడ్ ఫండ్ నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1,00,00,000 (ఒక కోటి రూపాయలు) విరాళంగా అందిస్తున్నట్లు వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కృష్ణా డీసీసీబీ ప్రధాన ధ్యేయమని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు అండగా నిలవడం సహకార బ్యాంకింగ్ వ్యవస్థ సామాజిక బాధ్యత అని తెలిపారు."రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వంతో పాటు సహకార రంగం కూడా బాధ్యతగా ముందుకు రావాలి. రైతుకు ఆర్థిక భరోసా కల్పించడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం మా ప్రథమ ప్రాధాన్యత. రైతుల సంక్షేమం కోసం కృష్ణా డీసీసీబీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని నెట్టెం రఘురాం పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృష్ణా డీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంని, బ్యాంకు ఉన్నతాధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు, ఆదరణ పొందుతూ సహకార బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కృష్ణా డీసీసీబీ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ, అభివృద్ధిలో నూతన ప్రమాణాలు సృష్టించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం.. మధ్యవర్తిత్వంతో వివాదాలకు పరిష్కారం!

- డిసెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్
- ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి





ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

న్యాయం పొందేందుకు అధిక ఖర్చులు, సుదీర్ఘ నిరీక్షణ అవసరం లేదని, ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం వంటి అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని పిలుపునిచ్చారు. వివాదాలను కోర్టుల చుట్టూ తిప్పకుండా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా చేసుకోవచ్చని సూచించారు.న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో న్యాయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ నుంచి జిల్లా కోర్టు సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీకి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని నాయకత్వం వహించారు.

న్యాయ సేవల ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశా రు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రజల కు అవగాహన కల్పించారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందుబా టులో ఉందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నా రులు, దివ్యాంగులు, యాసిడ్ దాడుల బాధితు లు, అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ సహాయం అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

లోక్ అదాలత్‌తో తక్షణ పరిష్కారం

డిసెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల అంగీకారంతో కుదిరే రాజీకి చట్టబద్ధమైన తుది తీర్పు హోదా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా వేలాది వివాదాలకు పరిష్కారం లభిస్తోందన్నారు.

మధ్యవర్తిత్వంతో 140కి పైగా కేసుల పరిష్కారం

జిల్లాలో అమలవుతున్న మధ్యవర్తిత్వం 3.0 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 140కి పైగా కేసులు పరిష్కారమయ్యాయని వెల్లడించారు. డిసెంబర్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కోర్టుల్లో కేసులు నమోదు కాకముందే తలెత్తే వివాదాలను సైతం కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఆసక్తి ఉన్నవారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.న్యాయ విజ్ఞాన శిబిరాలు, న్యాయ అవగాహన కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

డిసెంబర్ 12లోగా లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించదగిన కేసులను గుర్తించి, ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకునేలా మీడియా ప్రజల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి జి. వెంకటేశ్వర్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. వరలక్ష్మి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సి. యుగంధర్, ఇతర న్యాయాధికారులు, న్యాయవాదులు, ప్యానెల్ న్యాయ వాదులు, మధ్యవర్తులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 11 నవంబర్ 2026

ప్రజల కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం
కూటమి ప్రభుత్వం

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఏలూరు నగరపాలక సంస్థ మేయర్‌గా ప్రజలచేత భారీ మెజారిటీతో నేరుగా ఎన్నికైన రెడ్డి అప్పలనాయుడుని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మర్యాదపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడుకి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శాలువా కప్పి, పుష్పమాలలు వేసి సత్కరించారు. నగర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నూతన పాలకవర్గం ముందుకు సాగాలని, మేయర్‌గా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆత్మీయ కలయికపై స్పందించిన మేయర్ రెడ్డి అప్పలనాయుడు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్కి ధన్యవాదాలు తెలియజేశారు. దాదాపు 30ఏళ్లుగా తనకు, ఎమ్మెల్యేకి ఎంతో సాన్నిహిత్యం ఉందని, తన విజయాన్ని కాంక్షిస్తూ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపి అండగా నిలిచిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్కి కృతజ్ఞతలు తెలిపారు.

మురుసు తుపానుతో కొట్టుకుపోయిన రహదారికి మోక్షం!

- జనసేన ఎంపీటీసీ రాంబాబు



ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో మురుసు తుఫాను పెట్టిన బీభత్సం అంతా ఇంతా కాదు రోడ్లు, కాలువలు,గట్లు చెరువులు ఎక్కడికి అక్కడ కొట్టుకుపోయాయి. జీలుగుమిల్లి మండలం లో ఏ గ్రామం చూసిన ఒక ఊరి నుండి ఒక ఊరుకి వెళ్లే పరిస్థితి లేకపోయింది. టి గంగన్నగూడెం పంచాయతీ పరిధిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలు పై నిర్మించిన కాలవ కొట్టుకుపోవడంతో టీ గంగను గోడానికి బాహ్య ప్రపంచంతో అనుసంధానం తెగిపోయింది. పోలవరం శాసనసభ్యులు బాలరాజు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు కుంజా రాంబాబు ఆధ్వర్యంలో కాలువల్లో కొట్టుకుపోయిన దారికి గత రెండు రోజుల నుండి జెసిబి ట్రాక్టర్లతో దగ్గరుండి దారికి మోక్షం కల్పించారు. సుమారు 500 ట్రాక్టర్ ట్రిప్పులతో యుద్ధ ప్రాతిపదికన దార్లకు తెచ్చారు. ఎవరికి వారే రైతులు కొంత సహాయం చేస్తూ పాముల వారి గూడెం రైతు వేగి వెంకటేశ్వరరావు గ్రామస్తులు సహకారంతో మరిది వెంకటేశ్వరరావు, కొమరం వెంకటేశ్వరరావు, కొమరం వీరప్ప, మడకం దుర్గారావు, రాగం సత్యనారాయణ, కొమరం వంశీకి మోక్షం కల్పించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీలిగిన మండలంలోని అనేకదారులు కొట్టుకుపోయి ఉన్నాయి. వీటికి తక్షణమే ప్రభుత్వ అధికారులు సంబంధిత శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేసి రోడ్లు బాగు చేయించాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రబీ సాగుకు శ్రీకారం..
రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

- మానిపండు తెగులు నివారణపై రైతులకు అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో మంగళవారం నుంచి రబీ సీజన్ పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభమైందని మండల వ్యవసాయాధికారి జె. భవాని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొత్త ఈదర, బొద్దనపల్లి గ్రామాల్లో రైతులకు సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కొత్త ఈదరలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వరి పంటలో మానిపండు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూత దశలో గాలిలో తేమ అధికంగా ఉండటం, మంచు, మబ్బులతో కూడిన వాతావరణం కారణంగా ఈ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. తెగులు సోకిన వరి గింజలు ఆకుపచ్చ రంగు ముద్దలుగా మారి, అనంతరం పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడతాయని వివరించారు. దీని నివారణకు లీటరు నీటికి ప్రొపికోనజోల్ ఒక మిల్లీలీటరు లేదా కార్బెండజిమ్ ఒక గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని, అవసరాన్ని బట్టి వారం వ్యవధిలో మరోసారి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

- హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి!
- హిమశేఖర్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి,అనకాపల్లి



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐ శేషగిరిరావు సూచించారు. అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు స్థానిక హిమశేఖర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మోటారు వాహనాల చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ శేషగిరిరావు విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు కీలక అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లడమే కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ప్రమాదం జరిగిన తొలి గంటలోనే ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. బాధితులకు సకాలంలో సహాయం అందించే గుడ్ సమారిటన్లకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రివార్డుల గురించి వివరించారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ అత్యవసర వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న సహాయ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులందరితో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించిన అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీలో హల్ చల్ చేస్తున్న పవన్ కళ్యాణ్ డైవర్స్ వ్యవహారం

- జీర్ణించుకోలేకపోతున్నా కూటమి నాయకులు, అభిమానులు, జనసైనికులు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



ఏపీ రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్, భార్య అన్నా లెజ్నెవ విడాకుల వ్యవహారం ఏపీ రాష్ట్ర టాక్ ది ఏపీగా మారిపోయింది. ఇప్పటికే ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్ మళ్లీ మూడో భార్యకు కూడా విడాకులు ఇవ్వడం నమ్మ లేక పోతున్నామని అంటూ ఎక్కడ చూసినా చర్చ నియాసంగా మారింది. ఎలక్ట్రానిక్ మీడియా,సోషల్ మీడియా మాత్రమే కాకుండా గల్లి గల్లి కి మనిషి మనిషి కి చర్చ రావడం విశేషం. రష్యా మోడల్ గా ఉన్న అన్నా లెజెనెవను సెప్టెంబర్ 30, 2013లో పవన్ కళ్యాణ్ వివాహం చేసుకోగా మార్కు శంకర అనే బాబు కూడా కల్గిన విషయం తెలిసిందే.

జీర్ణించుకోలేకపోతున్నా కూటమి నాయకులు,అభిమానులు, జనసైనికులు

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్న లేజ్ నే వా విడకుల వ్యవహారం పవన్ కళ్యాణ్ అభిమానులు జనసైనికులలో నే కాకుండా కూ టమి ప్రభుత్వంలోనే కలకలం రేపింది. ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డట్టు అయింది అని పలువురు అంటున్నారు. పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారం దావానంల రాష్ట్రవ్యాప్తంగా హల్చల్ చేయడం మెగా కుటుంబంలో కూడా తలనొప్పిగా మారినట్లు సమాచారం. ఇప్పుడిప్పుడే ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్స్ సాధించి సీఎం రేంజ్ స్థాయికి పార్టీ చేరుకుంటున్న తరుణంలో ఈ విడాకులు వ్యవహారం ఏమి నష్టం చేస్తుందో అని జన సైనికులు, వీర మహిళలు, అభిమానులుజీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. ఇక కూటమి పార్టీ అగ్ర నేతల సైతం ఈ వ్యవహారం పార్టీకి ఏ విధంగా నష్టం తెచ్చిపెడుతుందోనని డైలమాలో పడ్డట్టు సమాచారం. ఈ వ్యవహారం ప్రతిపక్షాలకు గొప్ప ఆయుధంగా మారుతుందేమోనని,తద్వారా కూటమి ప్రభుత్వం విచ్ఛిన్నానికి దారితీస్తుంది ఏమోనని కూడా ఆ పార్టీలో అంతర్గతంగా ఆందోళన కూడా నెలకొన్నట్లు ప్రచారం. మోడీ, యోగి ఆదిత్యనాథ్ దారిలోనే పవన్ కళ్యాణ్:: పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారం ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనియాంశంగా మారిన నేపథ్యంలో పలువురు విశ్లేషకులు అయితే మోడీ, యోగి ఆదిత్యనాథ్ దారిలో నడవడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం అయిన తర్వాత పవన్ కళ్యాణ్ మూడో భార్యఅన్నా లెజ్నెవ తో కనీసం మాట్లాడే పరిస్థితి లేకపోవడం పూర్తిగా ప్రజల సేవకే అంకితం అయిపోవడంతో వారి ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి ఈ పరిస్థితి కి దారితీసి ఉండొచ్చని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ పవన్ కళ్యాణ్ మాత్రం ఇకపై మోడీ, యోగి ఆదిత్య బాటలో నడవడానికి ఈ కీలక నిర్ణయం తీసుకుని ఉండొచ్చని పలువురు విశ్లేషకులు కూడా భావిస్తున్నట్లు సమాచారం. అయితే భవిష్యత్ పరిస్థితి ఏ విధంగా ఉంటుందనేది వేచి చూడాల్సిందే మరి.



కార్తీక మాస మహోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన ఆర్ జే డి త్రినాధరావు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసి వున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు మంగళవారం అనగా ఈరోజు మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు కార్తీక మాస మహోత్సవములు జరుగు సందర్భంగా దేవస్థానం వద్ద పలు ఏర్పాటులను పరిశీలించుటకు రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాధ రావు క్యూలైన్సు, కార్తీక మాస అన్నదాన కార్యక్రమములు జరిగే స్థలములను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులు వేలాదిగా తరలివస్తే వాళ్లకు దర్శనం ఏ విధంగా ఏర్పాట్లు చేస్తూన్నారని అనే దానిపై కార్యనిర్వహణ అధికారి వారికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి వెంకటేశ్వరరావు పలు దేవాలయాల కార్య నిర్వహణ అధికారులు వేణు అరుణ్ కుమార్ శంకరం, ఆర్ రంగరాజన్ ,అరసవల్లి శ్రీనివాసు ,ఏ శ్రీనివాసు పలు కార్యనిర్వహణాధికారులువారి వెంట వివిధ ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాణ అధికారి రాపాక శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు,ఆలయ సూపరింటెండెంట్ వాసు, సీనియర్ అసిస్టెంట్ గాంధీ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్ కార్యక్రమాన్ని
విజయవంతం చేయండి



ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

వచ్చే నెల డిసెంబర్ 12 వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి బి.హెచ్. వి.లక్ష్మీ కుమారి కోరారు.ఈమేరకు మంగళ వారం మంగళవారం జిల్లా కోర్టు హాలులో న్యాయవాదులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీ చేసుకోవడానికి అవకాశం ఉన్న కేసులుకు ప్రతి న్యాయవాది సహకారం అందించాలని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా లభించే ప్రయోజనాలు కక్షిదారులకు చెప్పి వారిని రాజీమార్గం వైపు నడిపించే బాధ్యత న్యాయవాదులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు, ట్రెజరర్ సాధే నారాయణరావు, మహిళా ప్రతినిధి కె. వి. సత్యవాణి, న్యాయవాదులు పలివెల సత్యనారాయణ, దొమ్ములపాటి సత్యనారాయణ, గాలింకి చిట్టిబాబు, పిల్లా పృథ్వి రామయ్య, కటకం అబ్బురామ్, పి.భరత్ బాబు, పంపన విటల్,బొడ్డపాటి సురేష్ కుమార్, ఎస్. బి.ఎస్ కుమారస్వామి, సూరంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు ఈగల్ డిపార్ట్మెంట్ అవగాహన

అమలాపురం,ప్రజాభూమి ప్రతినిధి



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం పట్ట ణంలోని డీ.డీ.జ. ఇన్‌స్టిట్యూట్‌లో ఈగల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమంలో ఈగల్ ఇన్స్పెక్టర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక దుష్ప రిణామాల గురించి వివరించడం జరిగింది. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, చెడు వ్యసనా లకు ఆకర్షితులు కాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. అలాగే యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈగల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా లేదా సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ 1972 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఇన్స్పెక్టర్ జి.వేంకటేశ్వరా మరియు ఈగల్ సిబ్బంది డీ డీ జ ఇన్స్టిట్యూట్ యాజమాన్యం సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సానుభూతికే పట్టం కట్టిన ఎలమంచిలి ఓటర్లు

- 15, 147 ఓట్ల భారీ మెజార్టీతో జనసేన అభ్యర్థి నాగలక్ష్మి గెలుపు

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం లో ఇటీవలం జరిగిన జడ్పిటిసి ఎన్నికలు లో సానుభూతి పవనాలు బాగా వీచాయి. ఈ జడ్పిటిసి ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిని కొడవటి నాగలక్ష్మి 15,147 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. నాగలక్ష్మి గతంలో జనసేన పార్టీ తరపున ఎంపీటీసీ అభ్యర్థి ని గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అదేవిధంగా నాగలక్ష్మి భర్త కొడవటి వరబాబు కూడా జనసేన పార్టీ తరపున జడ్పిటిసి అభ్యర్థిగా గా గతంలో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో రెండుసార్లు భార్యాభర్తలు కూడా ఓటమి చవిచూశారు. ఆర్థికంగా నష్ట పోయారు కూడా.దీంతో ఈ భార్యాభర్తల పై ఎలమంచిలి మండలం ఓటర్లు ఈసారి జెడ్పిటిసి ఎన్నికల్లో సానుభూతి పవనాలు కురిపించారు. ఫలితంగా నాగలక్ష్మి 15 వేల 147 ఓట్ల భారీ మెజార్టీ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి భర్త మరియు ప్రస్తుత మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొడవటి వరబాబు మాట్లాడుతూ తమపై సానుభూతి చూపి గెలిపించిన ఓటర్లు, ఎలమంచిలి మండల ప్రజలు మనసులు గెలిచేలా సేవలందిస్తానని తెలిపారు.అదేవిదంగా రెండుసార్లు తమ కుటుంబం ఓటమి చవి చూసిన నమ్మకం సడలకుండా మళ్లీ తమకే జడ్పిటిసి టికెట్టు ఇచ్చినందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, స్థానిక మంత్రి నిమ్మల రామానాయుడు, నియోజకవర్గ నేత బన్నీ వాసు, బోనం వెంకట నరసయ్య, తులా రామలింగేశ్వరరావు, జనసేన నాయకులు, వీర మహిళలకు వరబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాభూమి
కోనసీమ
5
బుధవారం 11 నవంబర్ 2026

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

• కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

అమలాపురం, ప్రజాభూమి ప్రతినిధి.



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెండు విడతలుగా నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్, విద్యాశాఖ తదితర శాఖల అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, మైక్రో అబ్జర్వర్లు, వెబ్‌కాస్టింగ్, వెబ్‌స్ట్రీమింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ఈ నెల 14వ తేదీలోపు నూతన కార్యవర్గాల ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకునేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 19వ తేదీన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు, 20వ తేదీన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లా పరిషత్ సీఈఓ వసంత మాధవి ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.అనంతరం జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడతకు 2,272 బ్యాలెట్ బాక్సులు, రెండో విడతకు 2,362 బ్యాలెట్ బాక్సులు అవసరమవుతాయని తెలిపారు. అన్ని మండలాలకు అవసరమైన ఎన్నికల సామగ్రి, మైక్రో అబ్జర్వర్లు, వెబ్‌కాస్టింగ్, వెబ్‌స్ట్రీమింగ్ ఏర్పాట్లపై వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన 1,613 లొకేషన్లలో సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశంపై జిల్లా ఎస్పీతో మాట్లాడి అవసరమైన భద్రతా ఏర్పాట్లు సమన్వయం చేస్తానని తెలిపారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్వహించిన శిక్షణ తరగతులకు గైర్హాజరైన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధులకు నియమితులైన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, అమలాపురం, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు కె. సరళావతి, జి.వి.వి. సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి కె. శాంతికుమారి, జిల్లా పరిషత్ సీఈఓ వసంత మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబ్ బాషా, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం. మురళీకృష్ణ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సి.హెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి వ్యాధి నియంత్రణకు చర్యలు చేపట్టాలి

• జిల్లా కలెక్టర్ కె.వైట్రీ సెల్వి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఏలూరు, జిల్లాలో హెచ్ఐ వి వ్యాధి వ్యాప్తి నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి నియంత్రణ, వైద్య సేవలపై స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం వైద్య శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమాజంలో హెచ్ఐవి వ్యాధిని నిర్మూలించడానికి నియంత్రణ ఒక్కటే మార్గమని, క్షేత్రస్థాయిలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పరిశ్రమలు, హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్న ప్రాంతాలలో హెచ్ఐవి టెస్టులు మరింత ముమ్మరం చేయాలనీ . ప్రైవేట్ వ్యాధి నిర్ధారణ కేంద్రాలలో హెచ్ఐవి వ్యాధిగ్రస్తునిగా గుర్తించిన వారి వివరాలు తెలుసుకుని, వెంటనే వారికి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఐవి కి ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నవారి వివరాలు తీసుకుని, ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ పూర్తిఅవగాహన కలిగి ఉండాలని, తొలిదశలోనే తగుజాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి . సమాజంలో విస్తృత అవగాహన అవసరమని, యువత, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, ఎన్జీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ?యువతకు హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి, నివారణా చర్యలుపై సరైన అవగాహన పెంపొందించుకునేలా ?కళాశాలలు స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ?ఎయిడ్స్ బాధితులు పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా వారికి మానసిక ధైర్యాన్ని అందించడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. హెచ్ఐవి/ఎయిడ్స్‌పై నియంత్రణకు ప్రజలు భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. హెచ్ఐవి వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షితమైన జీవన విధానం, హెచ్ఐవీ పరీక్షలు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు వారి ఆరోగ్య వివరాలు ఆన్లైన్ లో పొందుపరచాలిలి జిల్లాలోని ప్రజలందరికీ ఉచిత వైద్య భద్రత అందించేందుకు వ్యాధులు రాకముందే గుర్తించేందుకు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించి ఆన్లైన్ లో పొందుపరచాలన్నారు. ప్రజలు గతంలో వ్యాధులు, చికిత్స, ప్రస్తుతం గుర్తించిన ఆరోగ్య సమస్యలు అందుకు అందిస్తున్న చికిత్స వివరాలను ఆన్లైన్ పొందుపరచాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.యు.శోభ, డిసిహెచ్ ఎస్ డా. బేబీ కమల, డీఈఓ వెంకటలక్ష్మమ్మ జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబి అధికారి డా.యన్.లక్ష్మీనారాయణ, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జి. శ్యామల, జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలలో సైతం జిల్లా యంత్రాంగం అద్భుతంగా పనిచేసి, పురపాలక, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారని అదే స్ఫూర్తితో గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల ఆర్ఓ లు, ఇతర ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో నగరపాలక, పురపాలక, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ సమయంలో అర్నాబ్, మురసు తుఫాన్లు భీభత్సం సృష్టించాయని, అయినప్పటికీ తుఫాన్ సహాయక కార్యక్రమాలలో పాల్గొంటూనే రెండు విడతల ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించడం జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల నామినేషన్ నుండి తుది జాబితా, పోలింగ్, కౌంటింగ్, ఫలితాల వెల్లడి వరకు ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలపై అధికారులు పూర్తి స్థాయి అవగాహన కల్పించి, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. త్వరలో తుఫాన్ వస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ రూమ్ లను అనువుగా ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి మరొక సారి పరిశీలించి, మార్పులు అవసరమైతే నిర్దిష్టమైన కారణాలతో వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలలో విద్యుత్, త్రాగునీరు, వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు.

పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి సౌకర్యాలలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవు

ఎన్నికల నిర్వహణ ప్రతీ ఉద్యోగికీ అత్యంత కఠినమైన బాధ్యత అని, అటువంటి బాధ్యతలు నిర్వర్తించే ఎన్నికల సిబ్బందికి కల్పించే సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. ఎన్నికల సిబ్బందికి నాణ్యమైన భోజనం, వసతి అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సమయాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి సరైన భోజనం కూడా కల్పించలేదనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, వీటిపై విచారణ చేయడంతో పాటు, ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుంటానని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, నూజీవీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణ మోహన్, డిపిఓ మల్లికార్జునరావు, సెట్ వెల్ సీఈఓ ప్రభాకరరావు, గృహ నిర్మాణ శాఖ అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎడవల్లి విద్యార్థులు

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట



రాష్ట్రస్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీకి ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి ఇరువురు బాలికలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరి చెప్పారు. ఎస్ జి ఎఫ్ ఐ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ ఉంగుటూరుమండలం నారాయణపురం సమత స్పోర్ట్స్ అకాడమీ నందు జరిగిన సెలక్షన్స్‌లో కామవరపు కోట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈస్ట్ యడవల్లి లో ఎనిమిదో తరగతి చదువుతున్న సకల బత్తుల ఎలిజిబెత్ రాణి, పంతగాని ప్రియాంక, వీరు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూ -14 బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికై త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి రవి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఏ.ల్ కోటేశ్వరి విద్యా కమిటీ చైర్మన్ మరీదు నాగలక్ష్మి మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు క్రీడాకారులను మరియు వ్యాయామ ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

అంగన్వాడీలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం



ప్రజాభూమి,బుట్టాయగూడెం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ యువి. పద్మావతి తెలిపారు. స్థానిక విలేకరులతో పద్మావతి మాట్లాడుతూ మండలం నందలి 131 అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం హైస్కూల్లో ప్రారంభించిన ఈ శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 10, 11 తేదీలలో జరుగుతాయని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో "పోషన్ బి పడాయి బి పేరిట సున్నా నుంచి ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి, వారి మానసిక శారీరక అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్స్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో

రక్తదానంపై అవగాహన సదస్సు

ప్రజాభూమి ఏలూరు



వట్లూరులోని సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో బయోటెక్నాలజీ విభాగం, హెల్త్ సెంటర్,ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,ఏలూరు వారి సహకారంతో "డొనేట్ బ్లడ్ -- సేవ్ ఏ లైఫ్" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ చైర్మన్,హెమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ ఎం.బి.ఎస్.వి. ప్రసాద్ హాజరై మాట్లాడుతూ, రక్తదానం గొప్ప మానవతా సేవ అని,ఒకరు చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తదానం ఎంతో అవసర మని డాక్టర్ శ్రావణి లక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఎంసీ సభ్యురాలు అదుసుమిల్లి నిర్మల, ఎస్‌బీఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ వై. నిర్మల, కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ జి. సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. హిమబిందు,అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ విజేత హైస్కూల్‌లో ప్రపంచ సైన్స్ దినోత్సవ వేడుకలు

• విద్యార్థులు శాస్త్రీయ ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి

• డా. జె.వి. ప్రమోద్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

విద్యార్థులందరూ విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన కలిగి ఉండాలని శ్రీ విజేత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డా. జె.వి. ప్రమోద్ కుమార్ సూచించారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తాళ్లపూడిలోని శ్రీ విజేత హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాస్త్రీయ ఆవిష్కరణలను విద్యార్థులకు పరిచయం చేశారు. ప్రముఖ శాస్త్రవేత్తల చిత్రపటాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసి వారి పరిశోధనలు, సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అండర్ 14 వాలిబాల్ పోటీలకు త్రివిధ విద్యార్థులు ఎంపిక

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుడివాడలో అండర్ 14 వాలీబాల్ బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్స్ నిర్వహించిన కమిటీ సభ్యులు. ఈ సెలక్షన్లో బాయ్స్ 12 మంది గర్ల్స్ 12 మందిని సెలెక్ట్ చేయగా అందులో నూజీవీడు పట్టణంలోని త్రివిధ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న అక్కినేని వైభవ్, అక్కినేని మోక్షజ్ఞ ఇద్దరూ సెలెక్ట్ అయ్యారు. ఈ నెల 11, 12,13 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోయే అండర్ 14 వాలీబాల్ టోర్నమెంట్లో పాల్గొనేందుకు బాయ్స్ 12 మంది,గర్ల్స్ 12 మంది ఉమ్మడి కృష్ణాజిల్లా తరపున ఆడేందుకు విజయవాడ నుండి తరలి వెళ్లారు.వీరు విజయం సాధించాలని పీఈటీలు వారి యొక్క పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

• 12 మంది లబ్ధిదారులకు అంత్యోదయ అన్నయోజన రేషన్ కార్డుల పంపిణీ



ప్రజాభూమి ఏలూరు

కూటమి ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో అనేక ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంతో పాటు పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.మంగళవారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి,వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఒక్కో కుటుంబానికి నెలకు 35 కిలోల బియ్యం అందించే అంత్యోదయ అన్నయోజన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.రానున్న రెండున్నరేళ్లలో పేదలకు మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా దేవర్ష్ హాస్పిటల్స్‌లో

ఆధునిక వైద్య సేవలు

ప్రజా భూమి, ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని దేవర్ష్ హాస్పిటల్స్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పథకం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి అధినేత డాక్టర్ అంజి నాయక్ తెలిపారు. ప్రజలకు ఆధునిక వైద్యాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకం కింద పలు వైద్య విభాగాల్లో చికిత్స అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, గైనకాలజీ అండ్ అబ్స్టెట్రిక్స్, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ట్రామా అండ్ క్రిటికల్ కేర్, లాపరోస్కోపిక్ సర్జరీ వంటి విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అదేవిధంగా ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన బీమా సౌకర్యంతో పాటు నగదు రహిత వైద్య సేవలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులైన ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య సేవలు పొందాలని డాక్టర్ అంజి నాయక్ సూచించారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

బుధవారం 11 నవంబరు 2026

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించిన: ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి అనంతపురం

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం నార్పల మండలం బి.పప్పూరు గ్రామానికి చెందిన కుమారి వసంత, అనంతపురం జేఎన్టీయూ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో బీఏ ఆర్ట్స్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. కళాశాల రెండవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో విద్యార్థినిని పరామర్శించి, ఆమె తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు ఎంపీ అంబిక. వసంతకి మెరుగైన వైద్యం అందించి, అవసరమైన అన్ని వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని వైద్యులు, జిల్లా వైద్యాధికారులను ఎంపీ అంబిక కోరారు. విద్యార్థిని త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అర్బన్ బ్యాంక్ చైర్మన్ జెల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులు నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు. వారికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ అంబిక భరోసా ఇచ్చారు.

వైసీపీ నేతలతో వేణురెడ్డి మంతనాలు

-ఆరు వార్డుల్లో విస్తృత పర్యటన
-ముఖ్య నాయకులతో విడివిడిగా భేటీలు
-పార్టీ బలోపేతం, సమన్వయంపై చర్చ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల సందడి ముగిసినా హిందూపురంలో రాజకీయ వేడి కొనసాగుతోంది. పార్టీ శ్రేణులను మళ్లీ సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్య నేత గుడ్డంపల్లి వేణురెడ్డి అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ముద్దిరెడ్డిపల్లిలోని ఆరు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి, ముఖ్య నాయకుల నివాసాలకు వెళ్లి వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై చర్చించారు. వైసీపీ ముఖ్య నాయకులు మద్దన జయప్ప, నీలూరి వెంకట్రాముడు, కోరుముట్ల నాగేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, నరేష్, రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులను వారి నివాసాల్లో కలుసుకుని విడివిడిగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా పార్టీ పరిస్థితి, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారితో చర్చించారు. ప్రతి నాయకుడి అభిప్రాయాలను తెలుసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై స్పందించాలని, పార్టీ శ్రేణుల మధ్య ఐక్యత, సమన్వయం కొనసాగించాలని ఈ సందర్భంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్య నాయకులను వ్యక్తిగతంగా కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా స్థానికంగా పార్టీ కార్యకలాపాలకు దిశానిర్దేశం చేసే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి లోకేష్ వాల్మీకి, రాష్ట్ర బూత్ కమిటీల ప్రధాన కార్యదర్శి వరుణ్ రెడ్డి, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సిద్ధరాంపురం విద్యార్థుల ఎంపిక

అండర్-14, అండర్-19 విభాగాల్లో ప్రతిభ చాటిన జడ్పీ హైస్కూల్ విద్యార్థులు



ప్రజా భూమి శింగనమల

బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం గ్రామం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు అండర్-14, అండర్-19 విభాగాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.శ్రీసత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 హాకీ పోటీలకు నందలక్ష్మి, గ్రీష్మసాయి ఎంపిక కాగా, హిమబిందు, మృణాలి స్టాండ్‌బై క్రీడాకారిణులుగా ఎంపికయ్యారు. అదేవిధంగా.పులివెందులలో జరగనున్న అండర్-19 హాకీ పోటీలకు.రామతులసి సుమలత ఎంపిక కాగా, అక్షిత స్టాండ్‌బై క్రీడాకారిణిగా ఎంపికైంది. ఈ వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీరజ్ వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గట్టు నాగరాజుతో పాటు ఉపాధ్యాయులు నాగేంద్ర ప్రసాద్, కోటప్ప, ఆదినారాయణ, బాలకృష్ణ, కమల, మధుబాల, ఉమాబాయి తదితరులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తోటి విద్యార్థులు సైతం ఎంపికైన క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ రగ్బీ పోటీలకు జడ్పీ హైస్కూల్ సిద్ధరాంపురం స్కూల్ విద్యార్థుల ఎంపిక

-పీడీ గట్టు నాగరాజు



ప్రజా భూమి శింగనమల

విశాఖపట్నం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కు రగ్బీ గర్ల్ నందిని, సుస్మిత, నంద లక్ష్మి, మహేశ్వరి, వర్షిత, బాయ్స్ ప్రభాస్ , వరుణ్ సందేశ్, గిరి చరణ్, సంతోష్ పోటీలకు జడ్పీ హైస్కూల్ సిద్ధరాంపురం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ వివరాలను పాఠశాల హెచ్ఎం నీరజ్ వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) గట్టు నాగరాజు తో పాటు నాగేంద్ర ప్రసాద్, కోటప్ప, అది నారాయణ, బాలకృష్ణ, కమల, మధుబాల ,ఉమా బాయ్ ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు. రాబోయే టోర్నమెంట్‌లో కూడా వీరు ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పేద విద్యార్థుల పీజీ కలలకు కూటమి సర్కారు గండి!"

- ప్రభుత్వ యూనివర్సిటీల్లో పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం!
- ఎస్.కె యూనివర్సిటీ వీసీకి వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం
- ప్రభుత్వ యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలి!
- విద్యార్థుల ఉన్నత విద్యా భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు సమాధానం చెప్పాలి
- ఖాళీ సీట్లు భర్తీ చేయకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమే!



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీజీ సీట్లను భర్తీ చేసేందుకుూ+ సెట్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ మంగళవారం తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఎస్కె యూనివర్సిటీ నాయకులు హేమంత్ విద్యార్థులతో కలిసి వైస్ ఛాన్సలర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో మిగిలిపోయిన పీజీ సీట్లకు వెంటనే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతపురం లాంటి కరువు ప్రభావిత జిల్లాలో పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించి పీజీ చదివే పరిస్థితి లేదని ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదువుకోవాలనే ఆశతో ఎదురుచూస్తున్న విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించకపోవడం తీవ్ర అన్యాయమని వారు మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వ యూనివర్సిటీల్లో సీట్లు ఖాళీగా ఉంటే.. మరోవైపు పీజీ చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్లు లేక చదువులకు దూరమవుతున్నారని ఇది ప్రభుత్వ విద్యారంగంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రచారానికే పరిమితమవుతున్నారా అంటూ ప్రశ్నించారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అంటూ ప్రభుత్వ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని మంత్రిని ప్రశ్నించారు. ాఖ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పీజీ సీట్ల వివరాలను ప్రకటించాలని, అర్హులైన విద్యార్థులకు పారదర్శకంగా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని, విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు తగిన గడువు ఇవ్వాలని, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధానాలను కూటమి ప్రభుత్వం వెంటనే విడనాడాలని,పేద విద్యార్థుల ఉన్నత విద్యా ఆశయాలకు అడ్డంకులు సృష్టించకుండా తక్షణమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి న్యాయం చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ విద్యార్థి నాయకులు శివ, తెజేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు బబ్లు, సాయిచరణ్, శివ, పులి కార్తికేయ, రాహుల్ రెడ్డి, ఇమ్రాన్, ఫయాజ్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

"ప్రజాభూమి" కథనానికి స్పందన -జాతీయ జెండా ప్రాంగణంలో శుభ్రత పనులు

-స్వయంగా పరిశీలించిన కమిషనర్ మల్లికార్జున -ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వెల్లడి





ప్రజాభూమి, హిందూపురం టౌన్

కొట్నూరు చెరువు కట్ట వద్ద జాతీయ త్రివర్ణ పతాక నిర్మాణం నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారడంపై 'ప్రజాభూమి'లో "జాతీయ జెండా సాక్షిగా మున్సిపల్ నిర్లక్ష్యం" ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. జాతీయ పతాకం నిర్మాణ పరిసరాల్లో పేరుకుపోయిన గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రత పనులు చేయించారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన జాతీయ త్రివర్ణ పతాకం, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక లోగో నిర్వహణ లేక కళావిహీనంగా మారిన విషయాన్ని ప్రజాభూమి వెలుగులోకి తీసుకొచ్చింది. చెరువు కట్టపై ప్రజలను ఆకర్షించేలా తీర్చిదిద్దాల్సిన ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు చెత్త సేకరణ పాయింట్ ఏర్పాటు చేయడంతో అపరిశుభ్రత నెలకొందని కథనంలో ప్రస్తావించింది. కేవలం తాత్కాలిక శుభ్రత చర్యలతో సరిపెట్టకుండా చెత్త సేకరణ పాయింట్‌ను తరలించి, జాతీయ జెండా నిర్మాణ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరాన్ని కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన కమిషనర్ స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి శుభ్రత పనులు చేయించడం పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రస్తుతం చేపట్టిన శుభ్రత పనులు తాత్కాలికంగా మిగిలిపోకుండా, చెత్త సేకరణ కేంద్రం తరలింపు, పరిసరాల సుందరీకరణ, నిరంతర నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పార్టీలకతీతంగా ముస్లిం కౌన్సిలర్లు గళం వినిపించాలి

-హిందూపురం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి -18 మంది ముస్లిం కౌన్సిలర్లకు సన్మానం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ముస్లిం సమాజ అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం పార్టీలకతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్‌లో తమ గళాన్ని బలంగా వినిపించాలని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కల్లూరు ఉమర్ ఫరూఖ్ ఖాన్ పిలుపునిచ్చారు. హిందూపురం పట్టణ అభివృద్ధితో పాటు మైనార్టీల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. హిందూపురం పట్టణంలోని జామియా ఈద్గా మైదానంలో మంగళవారం ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షతన, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కల్లూరు ఉమర్ ఫరూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల తరఫున గెలుపొందిన 18 మంది ముస్లిం సామాజిక వర్గ కౌన్సిలర్లను షహీద్ టిప్పు సుల్తాన్ స్మారక పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. మహిళా కౌన్సిలర్లకు గైనకాలజిస్ట్ డాక్టర్ షర్మిల, ముస్తఫా పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు బీబీ హజీరా ఖాన్ అవార్డులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఉమర్ ఫరూఖ్ ఖాన్ మాట్లాడుతూ, ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాజకీయ పార్టీలు వేరైనా ముస్లిం సమాజ ప్రయోజనాలు, ప్రజా సమస్యల విషయంలో అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఐక్యతను చాటాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో మైనార్టీలకు సంబంధించిన సమస్యలతో పాటు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. హిందూపురం అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రతి కౌన్సిలర్ తనవంతు బాధ్యత నిర్వహించాలన్నారు. దేశభక్తి, పరమత సహనం, మతసామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు షహీద్ టిప్పు సుల్తాన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు కలిగిన భారతదేశంలో శాంతి, సామరస్యం, వసుధైక కుటుంబ భావనతో ముందుకు సాగినప్పుడే సమాజంలో ఐక్యత సాధ్యమవుతుందన్నారు. మతసామరస్య వాతావరణాన్ని కాపాడుతూ దేశ సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి జానీ, కలీముల్లా, తలహా ఖాన్, మైనార్టీ నాయకులు డైమండ్ బాబా, షఫీ, ముఫ్తీ ఇబ్రహీం, మౌలానా రిజా ఉర్ రహ్మాన్, మౌలానా ఫయాజ్, మౌలానా తన్వీర్, మౌలానా వసీఉల్లా తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను అభినందించారు.

వైస్ చైర్మన్ పదవి మైనార్టీలకు కేటాయించాలి

-బాలకృష్ణకు సిపిఐ నాయకుల విజ్ఞప్తి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని మైనార్టీలకు కేటాయించి సామాజిక న్యాయం చేయాలని సిపిఐ నాయకులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ కాలం నుంచి తెలుగుదేశం పార్టీకి మైనార్టీలు అండగా నిలుస్తున్నారని, పార్టీ అభివృద్ధిలోనూ, విజయాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్ డి.దాదాపీర్, వినోద్ కుమార్ మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలో మైనార్టీ జనాభా గణనీయంగా ఉందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి మైనార్టీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. పార్టీ పట్ల తమకున్న అభిమానాన్ని, నిబద్ధతను ఎన్నికల సమయంలోనూ చాటుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని మైనార్టీలకు కేటాయించడం ద్వారా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అభ్యర్థిని బరిలో నిలిపినప్పటికీ, పట్టణంలోని మైనార్టీ ఓటర్లు అధికార పార్టీ అభ్యర్థి పురిడి మంజునాథ్‌కు మద్దతుగా నిలిచి ఆయన విజయానికి సహకరించారని సిపిఐ నాయకులు తెలిపారు. పురిడి శివయ్య తనయుడు పురిడి మంజునాథ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంలో మైనార్టీల పాత్ర కూడా ఉందని పేర్కొన్నారు. పార్టీకి అండగా నిలిచిన మైనార్టీలకు పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి వైస్ చైర్మన్ పదవిని మైనార్టీలకు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు నౌషాద్, అల్లాబకాష్, వెంకట్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి మా ధ్యేయం

-పుట్లూరు మండల ఎంపీటీసీలు.



ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండల కేంద్రంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 1 జడ్పీటీసి, 11 మంది ఎంపీటీసీలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా విజయానికి కారకులైన పుట్లూరు మండల ప్రజలకు మరియు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కి మరియు తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీలుగా గెలిపించినందుకు మా అందరి పైన బాధ్యత పెరిగిందని గ్రామాలలో త్రాగునీటి సమస్య పారిశుద్ధ్య సమస్య ఏ సమస్యలు లేకుండా అధికారులతో మమేకమై గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమ వంతు కృషి చేస్తామని మా గెలుపుకు సహకరించిన కూటమి అభ్యర్థులకు నాయకులకు కార్యకర్తలకు గ్రామ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని ముఖ్యంగా మా గెలుపుకు సాయి శక్తుల ప్రయత్నించి గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు లేకుండా చేసినటువంటి జెసి ప్రభాకర్ రెడ్డి గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకున్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి గ్రామాలలో ప్రశాంతంగా ఉండటం కోసం వైసీపీ అభ్యర్థులతో మాట్లాడి ఎలాంటి గొడవలు లేకుండా తమ వంతు కృషి చేసి మా గెలుపుకు సహకరించినందుకు ఎల్లవేళలా మీకు రుణపడి ఉంటామని అలాగే వైసిపి అభ్యర్థులు కూడా గ్రామాలలో ఎటువంటి గొడవలు లేకుండా ఉండేందుకు పోటీ నుంచి తప్పుకున్నందుకు వైసిపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉండి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను అందరికీ చేరువయ్యే విధంగా తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ గోవర్ధన్ రాజు , సీనియర్ నాయకులు ఎల్ కె చెన్నారెడ్డి, తక్కలపల్లి గోపాల్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమయ్య 7
బుధవారం 11 నవంబరు 2026

ఏడాది పొడవునా పచ్చదనమే ప్రకృతి వ్యవసాయానికి రక్ష

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొంటున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు - విజయ్ కుమార్ ప్రశంస

ప్రజాభూమి, పులివెందుల

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఏడాది పొడవునా వ్యవసాయ క్షేత్రాల్లో పచ్చదనాన్ని కొనసాగిస్తూ, వాతావరణ మార్పులను తట్టుకునే స్థిరమైన వ్యవసాయ విధానాలను అభివృద్ధి చేయాలని రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ సూచించారు.కడప జిల్లా కలెక్టరేట్‌లోని దృశ్య సమావేశ మందిరంలో జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన రైతు మాస్టర్ శిక్షకుల సమావేశంలో ఆయన దృశ్య సమావేశం ద్వారా పాల్గొని క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ప్రకృతి వ్యవసాయంలో 365 రోజులూ భూమిపై పచ్చని ఆచ్ఛాదన ఉండటం అత్యంత కీలకమని విజయ్ కుమార్ పేర్కొన్నారు.



ఇందుకోసం బహువార్షిక పంటల సాగుకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రంలో ఏడాది పొడవునా వచ్చదనం ఉండేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సమర్థంగా ఎదుర్కొన్న తీరు అభినందనీ యమని ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని వ్యవసాయ క్షేత్రాలకు అందిస్తున్నా యని తెలిపారు.త్వరలో నిర్వహించనున్న మొదటి దశ క్షేత్ర ధృవీకర ణకు క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థా యిలో సిద్ధం కావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా స్వీయ మదింపు పత్రాన్ని పూరించే విధానం, ధృవీకరణకు అవసరమైన అంశాలపై జిల్లా ప్రాజెక్టు నిర్వాహ కులు ప్రవీణ్ కుమార్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రస్తుతం నుంచి వచ్చే జూన్ వరకు ప్రతి వ్యవసాయ క్షేత్రంలో పచ్చదనాన్ని కొనసాగించేందుకు ముం దస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకో వాలని విజయ్ కుమార్ సూచించారు. ప్రణాళికా బద్ధంగా రైతులకు మార్గనిర్దేశం చేస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసే బాధ్యతను రైతు మాస్టర్ శిక్షకులు, ప్రకృతి వ్యవసాయ బృందం తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు వసంత కుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

శనగ, పత్తి పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు

ప్రజాభూమి, వేంపల్లె

మండలంలోని పాములూరు, అయ్యవారిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఎన్. కృష్ణప్రియ, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి పి. పద్మజ, మండల వ్యవసాయ అధికారి ఈ. బాలగంగాధర్ రెడ్డి పాల్గొని రైతులకు పలు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఎన్. కృష్ణప్రియ మాట్లాడుతూ శనగ పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రస్తుతం శనగ పంటను ఆశిస్తున్న రబ్బరు పురుగు నివారణకు ఎకరాకు 80 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలని సూచించారు.



అలాగే ఎండు తెగులు నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారి పి. పద్మజ మాట్లాడుతూ భూసార పరీక్షలు, భూసార పరీక్ష కార్డుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటను పొందవచ్చని వివరించారు. అలాగే మండల వ్యవసాయ అధికారి ఈ. బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ కపాస్ క్రాంతి పత్తి పథకం గురించి వివరించారు. పత్తి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడు

- మాతృభాషలో విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

ఆంగ్లేయుడైన సర్ సీపీ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకుని, తెలుగు నిఘంటువును రచించడంతో పాటు వేమన పద్యాలను సేకరించి తెలుగు భాషోద్ధారకుడిగా గుర్తింపు పొందారని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్ సీపీ బ్రౌన్ 228వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ.. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారిగా పనిచేసిన బ్రౌన్ కడపలో నివాసం ఏర్పరచుకుని తెలుగు భాషను అభ్యసించారని తెలిపారు. అనంతరం ఇంగ్లండ్‌లోని లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేశారన్నారు. స్వర్గీయ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కృషితో కడపలోని బ్రౌన్ నివాసాన్ని గ్రంథాలయంగా, పరిశోధనా కేంద్రంగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు మాతృ భాషలో విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని కోరారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాల్లో, ఉద్యోగాల్లో రెండు శాతం వెయిటేజీ మార్కులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు వెంకటేశు, రామాంజనేయ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య, బద్రి, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ రవిని మర్యాదపూర్వకంగా కలిసిన లింగాల జడ్పీటీసీ సరళా దేవి

అభివృద్ధి, పార్టీ బలోపేతంపై చర్చ

ప్రజాభూమి, పులివెందుల

ఇటీవల జరిగిన ఎన్నికల్లో లింగాల మండల జడ్పీటీసీగా విజయం సాధించిన యమ్మనూరు సరళ దేవి, లింగాల మండల తెలుగుదేశం అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, మండల తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డిలు మంగళవారం పులివెందుల తెలుగుదేశం కార్యాలయం లో పులివెందుల తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ బీటెక్ రవిని మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, వెంపల్లె తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ అజ్జుగట్టు రఘునాథరెడ్డి లను కూడా వారు కలిశారు.అనంతరం ఎన్నికల్లో విజయానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. లింగాల మండల అభివృద్ధి, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష ఏర్పాటు

కుమార్తె జన్మదినం సందర్భంగా అన్నదానం

ప్రజాభూమి,పులివెందుల

పట్టణంలోని మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో తుమ్మలపల్లె మాజీ సర్పంచ్ గజ్జల మహేశ్వర్ రెడ్డి, అనూష దంపతుల కుమార్తె వార్నికా రెడ్డి జన్మదినం సందర్భం గా అయ్య ప్ప మాలధారణ చేసిన భక్తులకు సోమవారం మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశారు.ముందుగా గజ్జల మహేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయంలోని మిట్ట మల్లేశ్వర స్వామి, అయ్యప్ప స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప, శివమాల ధరించిన భక్తులకు భిక్ష వడ్డించారు.ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో తమ కుమార్తె జన్మదినం సందర్భంగా అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు భిక్ష ఏర్పాటు చేయడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి ఏటా అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష ఏర్పాటు చేస్తూ వస్తున్నట్లు ఆయన తెలిపారు .ఈ సందర్భంగా మాలధారణ చేసిన భక్తులు గజ్జల మహేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.



స్త్రీ బిడ్డకు జన్మనిస్తూ మరణించకూడదు

- డి ఎం హెచ్ ఓ డాక్టర్ యుగంధర్

ప్రజా భూమి,
కడప సిటీ :



మంగళవారం ఉద యం జి ల్లా వైద్య ఆరోగ్య శాఖ అధి కారి డాక్టర్. యుగంధర్ త మ చాంబ ర్‌లో జరిగిన మాతృ మరణాల కమిటీ సమా వేశం జిల్లాలోని ప్రాధ మిక, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి తెలియ చేశారు. జిల్లాలో జరిగిన మాతృ మరణాలకు సంబంధించిన ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో ఎం ఎల్ హెచ్ పి ఎస్,ఏఎన్ ఎం ఎస్, ఆశాలతో, మాతృ మరణాలు జరిగిన గర్భవతుల కు సంబంధించిన బంధువు లతో,ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్య సేవలు అందించిన వై ద్యులతో మాతృ మరణాల కమిటీ సభ్యులు చర్చించా రు.మాతృ మరణాలకు స శీబంధించిన కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రతి నెలపి. ఎం.ఎస్.ఎం.ఏప్రోగ్రశీ లో గర్భవతికి అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించాల ని,ప్రమాదకర గర్భవతులన గుర్తించి ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లేని పరీక్షలను ఉ న్నత ఆసుపత్రులకు పంపిం చిఅన్ని పరీక్షలు నిర్వహించ లని, గర్భవతుల సంరక్షణ కొరకు అత్యవసరమైన స మయములో రవాణా సౌక ర్యము,పరీక్షల కొరకు జె. ఎస్.ఎస్.కె కార్యక్రమం ద్వా రా వైద్య ఖర్చులు చేయవ చ్చునని, వీటిపై అవగాహన కల్పించాలని వైద్యాధికారు లకు సూచనలు ఇచ్చారు.గర్భవతుల ఆరోగ్య దృష్ట్యా ఈనీజీ, 2డి ఈకో కూడా చేపించాలని,రక్తహీనత ఉ న్న గర్భవతులను, ప్రమాద కర గర్భవతులను గుర్తించి వారికి సుఖ ప్రసవం జరుగు వరకు నిరంతరము వారికి అందుబాటులో ఉంటూ వై ద్య సేవలు అందిం చాలని, వైద్యాధికారులకు,వైద్య సి బ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కర్నూ లు,తిరుపతి,తాడిపత్రి ప్ర వేట్ ఆసుపత్రులలో జరిగిన మాతృమరణాలపై వీడియో కాల్ ద్వారా ప్రైవేటు వైద్యు లతో చర్చించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్ర వీణ్ కుమార్,కమిటీ సభ్యు లు రిమ్స్ హెచ్ ఓ డి డాక్టర్ నీలిమ, డి సి హెచ్ డాక్టర్ హిమ దేవి, డాక్టర్ సునీల్, డాక్టర్ వినయ్, డాక్టర్ శ్రీదేవి ఎం సి హెచ్ నోడల్ ఆఫీసర్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కుమారి, డిప్యూటీ హెచ్ఈఓ ప్రాథమిక వైద్యాధికారులు, వైద్య సిబ్బంది,ఐసీడీస్,10 8,102 సిబ్బంది పాల్గొన్నా రు అని డాక్టర్ యుగంధర్ తెలియజేశారు.

కార్తీక దీప ప్రజ్వలన కార్యక్రమం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన పురాతనమైన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమానం మొదటి రోజున పురస్కరించుకొని కార్తీక దీప ప్రజ్వల కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ కార్తీక మాసం ప్రారంభం నుండి ఇంద్రకీలాద్రి వంటి ప్రముఖ దేవాల యాలలో ఎత్తైన ధ్వజస్తంభాలపై ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేస్తారు.కార్తీక మాసంలో హరిహరుల శివకేశ వుల అనుగ్రహం కోసం దీపాలు వెలిగించే అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక వేడుక అని ఆయన అన్నారు. దీపం అనేది జ్ఞానానికి, సానుకూల శక్తికి ప్రతీక. మనలోని అహంకారం అనే చీకటిని తొలగించి ఆత్మజ్ఞానాన్ని పొందడమే దీని అంతరార్థం అని తెలిపారు.స్కంద పురాణం ప్రకారం కార్తీక మాసంలో ఒక్క దీపం వెలిగించినా వెయ్యి యజ్ఞాలు చేసినంత ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసం అని,ఈ మాసంలో దీపాలు వెలిగించడం వల్ల పితృదేవతలకు మోక్షం లభిస్తుందని, కుటుంబానికి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు.ప్రతిరోజూ తెల్లవారుజామున సూర్యోదయానికి ముందు (ఉదయం 5:00 నుండి 6:30 మధ్య) సాయంత్రం సంధ్యా సమయంలో దీపాలు వెలిగించడం అత్యంత శ్రేష్ఠం విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తుల పాల్గొని కార్తీకదీప ప్రజ్వల కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

మన ఊరికోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు


– యాచకులు, నిరాశ్రయులకు పండ్లు, బిస్కెట్లు, ఖర్జూరం, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం--1 గ్రామానికి చెందిన మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు యస్.కె. నాయబ్, ఫర్హానా దంపతుల కుమార్తె హసీనా పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో కొత్త మాధవరం సమీపంలోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసి ఆత్మీయంగా వడ్డించారు. అనంతరం ఆలయాలు, బస్టాండు పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రదేశాల్లో జీవనం సాగిస్తున్న యాచకులు, నిరాశ్రయులను గుర్తించి వారికి పండ్లు, బిస్కెట్లు, ఖర్జూరం, ఎనర్జీ డ్రింక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ, హసీనా పుట్టినరోజు సందర్భంగా నాయబ్, ఫర్హానా దంపతులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హసీనా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. నాయబ్ కుటుంబ సభ్యులు భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సామల చెంగయ్య, రాటాల రామయ్య, వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

-ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం: అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, స్థానిక సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ మద్యం విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయించినా, అక్రమ మద్యం సరఫరాకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం పంపిణీకి పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి కఠినంగా వ్యవహరిస్తామని సీఐ స్పష్టం చేశారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే సందేశాలు పెడితే చర్యలు- ఎస్సై హారిక హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం: సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే సందేశాలు, వివాదాస్పద పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధవటం ఎస్సై హారిక హెచ్చరించారు. మంగళవారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ, స్థానిక గ్రామ సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజంపేట డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచనలతో సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా లేదా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసేలా పోస్టులు, మెసేజ్‌లు పంపితే వాటిని గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని ఎస్సై హారిక కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

-డ్వాక్రా సంఘాల సభ్యులకు ఏపీఎం సుజాత సూచన

ప్రజాభూమి, సిద్ధవటం: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకులు, శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను బాధ్యతగా సకాలంలో చెల్లించాలని సిద్ధవటం మండల ఏపీఎం సుజాత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, మండలంలో 840 స్వయం సహాయక డ్వాక్రా సంఘాలు ఉండగా, వాటిలో 8,430 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నిర్ణీత గడువులోగా చెల్లించడం ద్వారా సంఘాల ఆర్థిక పరిపుష్టితో పాటు బ్యాంకుల నుంచి భవిష్యత్తులో మరిన్ని రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రూపు లీడర్లు తమ సంఘాల సభ్యులు రుణ వాయిదాలను సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సభ్యులు చెల్లించిన రుణ వాయిదాలను గ్రూపు లీడర్లు ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత బ్యాంకుల్లో సకాలంలో జమ చేయాలని ఏపీఎం సూచించారు. రుణాల చెల్లింపులు, నగదు జమ విషయంలో ఎలాంటి అవకతవకలు లేదా సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంఘాల నాయకులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సభ్యులు, గ్రూపు లీడర్లు సమన్వయంతో పనిచేసి రుణ చెల్లింపుల్లో క్రమశిక్షణ పాటించాలని ఏపీఎం సుజాత కోరారు.

వైయస్ షర్మిలా రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ధ్రువకుమార్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి

కుమార్తె వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు



ప్రజాభూమి, పులివెందుల :

పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై హర్షవర్ధన్ రెడ్డిలు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.లోటస్ పాండ్ లోని తన నివాసంలో షర్మిలా రెడ్డిని వారు కలిసి పులివెందుల నియోజకవర్గ పార్టీ పరిస్థితులపై చర్చించారు. అనంతరం తన కుమార్తె వివాహంకు హాజరుకావాలని కోరుతూ షర్మిలా రెడ్డి ధ్రువకుమార్ రెడ్డికి, హర్షవర్ధన్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

బుధవారం 11 నవంబరు 2026

తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారుల ప్రత్యేక తనిఖీలు

– అధిక వేగంతో ప్రయాణిస్తున్న రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారులు అధిక వేగంతో ప్రయాణిస్తున్న రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ కంట్రోల్ రూమ్ ద్వారా అందిన వేగ నియంత్రణ పర్యవేక్షణ సమాచారాన్ని ఆధారంగా చేసుకొని, బెంగళూరు నుండి తిరుపతికి వస్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుతో పాటు, హైదరాబాద్ నుండి తిరుపతికి వస్తున్న మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అధిక వేగంతో ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారులు సంబంధిత బస్సులను గుర్తించి తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈతనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులు స్వర్ణలత, ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు తప్పనిసరిగా నిర్దేశించిన వేగ పరిమితులను పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు ప్రయాణించే బస్సుల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని, సమయానికి గమ్యస్థానానికి చేరుకోవాలనే తొందరలో అధిక వేగంతో వాహనాలు నడిపి ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని హెచ్చరించారు. రాష్ట్ర రవాణా శాఖ కంట్రోల్ రూమ్ ద్వారా బస్సుల వేగాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించి అధిక వేగంతో ప్రయాణించే వాహనాలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రావెల్స్ యాజమాన్యం డ్రైవర్లకు వేగ నియంత్రణ గురించి సరైన హెచ్చరికలు జారీ చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

సహకార సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు:



రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లాలోని 33 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సభ్యుల వివరాల సేకరణ, ఈ-కేవైసీ, ఓటర్ల జాబితాల తయారీ, నియోజకవర్గాల నిర్ధారణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సామగ్రి సమకూర్చడం, సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపై చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా సహకార అధికారి కార్యాలయము నందు జిల్లా సహకార అధికారి ఎస్.లక్ష్మి సహకార శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు జిల్లా సహకార శాఖ అన్ని చర్యలు చేపడుతోంది.

జనాభా గణన విజయవంతానికి టీమ్ వర్క్ అత్యంత ముఖ్యం

-జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

: జనాభా గణన (సెన్సెస్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు సూచించారు. మంగళవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జనాభా గణన పై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు టీమ్ లీడర్లుగా బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. జనాభా గణన ప్రక్రియపై పూర్తి అవగాహన, స్పష్టత కలిగి ఉండి క్షేత్రస్థాయి సిబ్బందికి సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు సమగ్ర శిక్షణ అందించి, తిరుపతి జిల్లాలో జనాభా గణనను ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు మరియు అధికారులు తిరిగి ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు తగిన రీతిలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది ఈ కార్యక్రమంలో అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి.నరసింహులు, తిరుపతి, ఆర్డిఓ రామ్మోహన్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మూలస్థానేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

లోక కళ్యాణం, సకల జనుల శ్రేయస్సు మరియు ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ కార్తీక మాస ప్రారంభం సందర్భంగా శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక దివ్య అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమాన్ని చక్రవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి స్వహస్తాలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం 5:30 గంటలకు తిరుపతి జిల్లా గాజులమండ్యంలోని శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామివారి ఆలయంలో ఈ అభిషేక కార్యక్రమం మరియు బిల్వఅష్టకం నిర్వహించారు . ఈ సందర్భంగా భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొంది నైవేద్యం స్వీకరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

ఎన్నికల విధుల్లో అధికారులు పూర్తి అప్రమత్తతతో, సమన్వయంతో పనిచేయాలి -:జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి ఎన్నికల విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి, తమకు అప్పగించిన బాధ్యతలను అప్రమత్తతతో నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్. గోవిందరావు ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, అనుసరించాల్సిన మార్గదర్శకాలపై జిల్లాస్థాయి అధికారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ జి. నరసింహులు, జెడ్ పి సి ఈ ఓ శోభన్ బాబు, తిరుపతి, డి పి ఓ సుశీలా దేవి, శ్రీకాళహస్తి ఆర్ డిఓలు, రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖల నోడల్ అధికారులు, తిరుపతి స్మార్ట్ సి టి జిఎం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచి ఫలితాల ప్రకటన వరకు అనుసరించాల్సిన ప్రతి దశపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలని తెలిపారు. మొదటి దశలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రచురణ, ఎన్నికల గుర్తుల కేటాయింపు వంటి ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. రెండవ దశలో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ కేంద్రాల సిద్ధం, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించిన విధివిధానాలను సమగ్రంగా వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు తదితర మౌలిక సదుపాయాలను ముందుగానే కల్పించాలని, పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, రవాణా, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆర్డీఓలు, డీడీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, నోడల్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ మండల, గ్రామ పంచాయతీ స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, నివేదికలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం, జాప్యం, పొరపాట్లు, నిబంధనల ఉల్లంఘనలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదని, ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు స్థానిక స్వపరిపాలన వ్యవస్థకు పునాది వంటివని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ప్రతి అధికారి సమష్టి బాధ్యతతో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం...!

-అర్హులైన వారు నమోదు పత్రాలు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలి

-జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేరు చేరని అర్హులైన వారికి.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గైర్హాజరు, నివాసం మారడం, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి కారణాలతో ఓటరు జాబితాలో పేరు చేరని వారి వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, పురపాలక కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు నమోదు పత్రాలను అందజేస్తారని, అందుబాటులో ఉన్న ఫోన్ నంబర్లకు వాట్సాప్, సందేశాల ద్వారా కూడా పంపిస్తారని తెలిపారు. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు సంఖ్యతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా నమోదు పత్రాలను పొందవచ్చని వివరించారు. ఇంతకుముందు నివాసం మారని వారు నమోదు పత్రంతో పాటు, గతంలో ఎందుకు నమర్పించలేకపోయారో తెలియజేస్తూ అనుబంధం-బి ప్రకటనను అందజేయాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు కొత్త చిరునామా వివరాలతో అనుబంధం-సి ప్రకటనను జతచేసి సమర్పించాలి. వీరు ప్రత్యేకంగా ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. చిరునామా ఆధార పత్రాలు లేని నిరాశ్రయులకు బూత్ స్థాయి అధికారి



పరిశీలన నివేదిక ఆధారంగా నివాస ధ్రువీకరణ కల్పిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ నమోదు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేరుస్తారని తెలిపారు. గతంలో ఉన్న ఓటరు గుర్తింపు సంఖ్యనే తిరిగి కేటాయిస్తారని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో పేరు చేర్చుకునే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నిరాశ్రయులు, ఇతర కారణాలతో అందుబాటులో లేని ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదే సమయంలో ఒకరి పేరు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయడం జరుగుతుంది.

జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

వసతి, భద్రత, మౌలిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి



డిసెంబర్ మొదటి వారంలో తిరుపతి జిల్లాలో నిర్వహించనున్న డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ కు గౌరవ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి పాల్గొననున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం.జయకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శారదాదేవి, డీఆర్ఓ జి. నరసింహులు, తుడా కార్యదర్శి శ్రీకాంత్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ రాజా నాయక్, విమానాశ్రయ అధికారి భూమినాధన్, వివిధ శాఖల అధికారులు, అదనపు ఎస్పీలు, ఆర్డీఓలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే జాతీయ స్థాయి ప్రముఖుల వసతి, భద్రత, రవాణా, విద్యుత్, వైద్య, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ హోటళ్లు, వసతి గృహాలు, హోమ్ స్టేల వివరాలను సేకరించి రిజర్వేషన్లు పూర్తి చేయడంతో పాటు, అవసరమైన మరమ్మతులు, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో రోడ్ల సుందరీకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. రహదారులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫుట్‌పాత్‌లను అందుబాటులో ఉంచాలని, వీధి దీపాలు, లైటింగ్ ఏర్పాట్లను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, ఐసర్ , ఐఐటీ ఇండియన్ కులినరీ ఇన్‌స్టిట్యూట్ లలో చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించేందుకు అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించాలన్నారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతల మేరకు ముందస్తు కార్యాచరణ రూపొందించుకుని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం లో తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డిఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, అదనపు ఎస్పి లు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, రామ కృష్ణ, శ్రీనివాస్, శ్రీలత, డిఎస్పి లు, తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలి



ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి

జిల్లాలో శిశు మరణాలు, మాతృ మరణాలు జరగకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక డిఎంహెచ్ఓ కార్యాలయం నందు తిరుపతి జిల్లాలో సెప్టెంబర్ మరియు అక్టోబర్ నెలలో జరిగిన 10 శిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బాలకృష్ణ నాయక్, కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాల పట్ల వైద్యాధికారులు ,సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని,బాల్య వివాహాల వలన, టీనేజి ప్రెగ్నెన్సీ వలన కలిగే ఆరోగ్య సమస్యలు గురించి, రక్తహీనత గురించి, కాన్పు కాన్పుకు మధ్య ఎడం యొక్క ఆవశ్యకత గురించి ఆశ వర్కర్లు ఏ.ఎన్.ఎం.లు , శిశు సంక్షేమ శాఖా సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పోహకారం లోపం లేకుండా చూడాలని, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు , వైద్య అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ప్రసూతి సమయం లో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి హై రిస్క్ కేసు పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి సాదారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, డి.ఐ.ఓ డా. శాంత కుమారి,డిపిఎమ్ఓ డాక్టర్ తులసీ దాస్, డి పి హెచ్ ఎన్ ఓ మంజుల, వైద్యం అందించిన మెటర్నిటీ హాస్పిటల్ ,రుయా హాస్పిటల్, స్విమ్స్ హాస్పిటల్ డాక్టర్లు ,ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు ,శిశు మరణాలు జరిగిన వైకోట ,పెనగలూరు, శెట్టిగుంట, పాపా నాయుడు పేట, చిన్నపాండూరు, కెవిబిపురం, ఏర్పేడు ,మంగళం, పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పి లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై మెప్మా గ్రూప్ సభ్యులకు అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న న్యాయ సేవా వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలో మెప్మా గ్రూపుల సభ్యులకు మహిళా చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మహిళలకు వారి చట్టపరమైన హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు న్యాయవాదులు రాజేశ్వరరావు, ప్రజ్ఞాశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి, చైతన్యవంతులైనప్పుడే సురక్షితమైన కుటుంబం, సమాజం ఏర్పడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల అపహరణ, యాసిడ్ దాడులు, అత్యాచారాలు వంటి నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు మోసాలకు గురికాకుండా, తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా సమస్యలను ఎదుర్కొనేందుకు ఇటువంటి న్యాయ విజ్ఞాన సదస్సులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మహిళలకు ఏవైనా చట్టపరమైన సమస్యలు ఎదురైతే సమీపంలోని మండల లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను నేరుగా సంప్రదించవచ్చని వివరించారు. అలాగే జాతీయ న్యాయ సేవల హెల్ప్‌లైన్ నంబర్ 15100కు ఫోన్ చేసి తమ సమన్వయలను తెలియజేయవచ్చని, న్యాయ సేవాధికార సంస్థలు తగిన సహాయం అందిస్తాయని న్యాయవాదులు పేర్కొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు
9
బుధవారం 11 నవంబరు 2026

రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలి

పరిహారం నిర్ధారణకు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలి - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: జిల్లాలోని రామకుప్పం, గుడుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లకు అనుసంధానంగా నిర్మించనున్న 220 కేవీ, 132 కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం న్యాయమైన భూ నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ కలెక్టరేట్లో నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కుప్పం ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి విద్యుత్ శాఖ అధికారులతో, కుప్పం కుప్పం ప్రత్యేక అధికారి మరియు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, కుప్పం ఆర్డీవో తో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, వ్యవసాయం, ఉద్యానవన, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, అటవీ శాఖ, సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుడుపల్లిలో 200/132 కేవీ సబ్‌స్టేషన్‌ను, రామకుప్పంలో విమానాశ్రయంతో పాటు ఇతర అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు వీకోట ప్రధాన ఫీడర్ నుంచి శాంతిపురం, గుడుపల్లి, రామకుప్పం ప్రాంతాల మీదుగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో విద్యుత్ టవర్ల నిర్మాణం, లైన్ల మార్గంలో భూముల వినియోగం వల్ల ప్రభావితమయ్యే రైతులకు అందించాల్సిన నష్టపరిహారాన్ని నిర్ణయించేందుకు సంబంధిత శాఖల అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించి జాబితాన్ని నవంబర్ 30 తేదీ లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా టవర్లు నిర్మించే ప్రాంతాలు, విద్యుత్ లైన్లు వెళ్లే మార్గాల్లో ప్రభావితమయ్యే భూములు, పంటలు, తోటలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. రైతులకు అందించాల్సిన నష్టపరిహారాన్ని ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా అంచనా వేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రామకుప్పం, గుడుపల్లి, శాంతిపురం మండలాల్లో సంబంధిత తహశీల్దార్లు, వ్యవసాయ, ఉద్యానవన, అటవీ, రిజిస్ట్రేషన్, రోడ్లు మరియు భవనాలు, ఇరిగేషన్, సర్వే తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల వివరాలు, వాటి విస్తీర్ణం, ప్రభావితమయ్యే రైతుల వివరాలను సేకరించాలని తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్మాణానికి సంబంధించిన ఈ-ట్రాన్స్‌కో అధికారులు కూడా నమన్వయంతో వనిచేసి అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సంబంధిత శాఖల అధికారులు సమగ్ర నివేదికను త్వరితగతిన సమర్పించాలని, నెల రోజుల్లోగా నష్టపరిహారం నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కుప్పం ఆర్డీవో , జిల్లా రిజిస్ట్రార్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారి, రోడ్లు మరియు భవనాల శాఖ అధికారి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం, మత్స్యశాఖ అధికారి, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు, ఈ-ట్రాన్స్‌కో ప్రతినిధులు, శాంతిపురం, గుడువల్లి, రామకుప్పం మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026

-శాప్ చైర్మన్ రవి నాయుడుకి ఆహ్వానం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ మరియు సభ్యులు శివయ్య మునుస్వామి మంగళవారం తిరుపతిలో శాప్ చైర్మన్ రవి నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవంబర్ 14 నుంచి 17వ తేదీ వరకు తిరుపతిలో అండర్-13 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్న యోనెక్స్--సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రవి నాయుడుని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుపతిలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం ఎంతో గర్వకారణమని అన్నారు. చిన్న వయసు నుంచే క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, పోటీ వాతావరణాన్ని కల్పించడం ద్వారా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ, రాష్ట్రాన్ని క్రీడా ప్రతిభకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా తిరుపతిని ఒక ప్రధాన క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు తిరుపతి వేదికగా నిలవడం ద్వారా స్థానిక క్రీడాకారులకు కూడా మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక ఛాంపియన్‌షిప్‌లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని, క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించి ఉన్నత స్థాయికి ఎదగాలని శాప్ చైర్మన్ రవి నాయుడు గారు పిలుపునిచ్చారు. రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులకు శాప్ చైర్మన్ రవి నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేదల భూములపై పెత్తందారుల కన్ను

నకిలీ పత్రాలతో భూముల ఆక్రమణకు యత్నిస్తున్నారంటూ బాధితుల ఆందోళన..

- రెవెన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ్యకు వినతిపత్రం

ప్రజా భూమి ప్రతినిధి:
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండలం, ఆలత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని తహనగర్‌లో నిరుపేద కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములపై ఆక్రమణల బెడద నెలకొంది. తమ జీవనాధారమైన భూములను కాపాడాలని కోరుతూ బాధితులు మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, ఆర్ఐ నల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తహనగర్ పరిధిలోని సర్వే నంబర్ 90/3లో ఉన్న నాలుగు ఎకరాల భూమిని సుమారు 40 నిరుపేద కుటుంబాలు గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. అయితే, అదే గ్రామానికి చెందిన శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి ఈ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఇందులో భాగంగా గతంలో మరణించిన శేషారెడ్డి పేరుతో నకిలీ పత్రాలు, తప్పుడు అడంగల్, 1-బి నకళ్లు సృష్టించి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని బాధితులు తెలిపారు. ఇదే అదనుగా భావించి ఈ నెల 9వ తేదీ రాత్రి జేసీబీ యంత్రంతో తమ సాగు భూముల్లోకి ప్రవేశించి బలవంతంగా దున్నేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. తమకు ఉన్న ఏకైక జీవనాధారమైన భూములు చేజారిపోతాయనే ఆందోళనతో అధికారులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. పేదల భూములకు రక్షణ కల్పించాలి. నకిలీ పత్రాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమ సాగు భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని బాధితులు ఆర్ఐ నల్లయ్యను కోరారు. స్పందించిన ఆర్ఐ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, తహనగర్ గ్రామ పెద్దలు, బాధిత కుటుంబాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బి.ఎన్ కండ్రిగ మండలంలో పంచాయతీ రిజర్వేషన్ల ఖరారు!

28 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ స్థానాల కేటాయింపు.. మహిళలకు 14 స్థానాలు- ఎంపీడీవో వెంకటరత్నమ్మ


ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలం రెండో విడత సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బి.ఎన్ కండ్రిగ మండలంలోని గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల కేటాయింపు జాబితా వెలువడింది మండలంలోని మొత్తం 28 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ అధికారులు జాబితాను ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ప్రకారం 28 సర్పంచ్ స్థానాల్లో మహిళలకు 14 స్థానాలు కేటాయించారు ఇందులో జనరల్ మహిళలకు 7, ఎస్సీ మహిళలకు 4, ఎస్టీ మహిళలకు 2, బీసీ మహిళలకు ఒక స్థానం కేటాయించారుఅదేవిధంగా జనరల్ కేటగిరీలో 7, ఎస్సీ కేటగిరీలో 5, ఎస్టీ కేటగిరీలో 2 స్థానాలు కేటాయించారు. మండలంలోని అలత్తూరు, భవానీశంకరాపురంచెన్నయ్యగుంట, గాజులపల్లె, కుక్కంబాకం, పార్లపల్లి, పుత్తేరి తదితర పంచాయతీలకు మహిళా రిజర్వేషన్లు కేటాయించగా, కాళ్లివెట్టు, కాంపాళెం, కరాణి, కాటూరు, నీర్పాకోట, నెలవాయి, నెర్నికండ్రిగ, పల్లమాల, తిమ్మభూపాలపురం, వేణుగోపాలపురం తదితర పంచాయతీలకు వివిధ సామాజిక వర్గాల ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించారు. సర్పంచ్ స్థానాలతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లోని వార్డుల సంఖ్య ఆధారంగా వార్డు సభ్యుల స్థానాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల బరిలో నిలవాలను కుంటున్న ఆశావహులు తమ పంచాయతీల్లో ఏ కేటగిరీకి రిజర్వేషన్ దక్కిందనే విషయంపై ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటనతో మండలంలోని గ్రామ పంచాయతీల్లో రాజకీయ సందడి మొదలైంది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థులు తమ అవకాశాలను బేరీజు వేసుకుంటూ ఎన్నికల నామీకరణాలకు సిద్ధమవుతున్నారు.



విజయుడికి దినకరుడి సన్మానం

ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు జడ్పీటీసీ సభ్యురాలిగా విజయం సాధించిన సన్నారెడ్డి అనితమ్మ, ఆమె భర్త సన్నారెడ్డి విజయ్ శేఖర్ రెడ్డి దంపతులను వాకాడుకు చెందిన టీడీపీ నాయకుడు వేము దినకర్ బాబు, యువ నాయకుడు హర్ష తమ కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. జడ్పీటీసీగా అనితమ్మ విజయం సాధించిన నేపథ్యంలో దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వేము దినకర్ బాబు, యువ నాయకుడు హర్ష కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి,
రాయచోటి:



రోడ్డు భద్రతపై వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు రాయచోటి పట్టణంలోని బంగ్లా జంక్షన్ వద్ద ఉన్న టాక్సీ స్టాండ్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ రవాణా శాఖ కమిషనర్, అన్నమయ్య జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో రిక్షాలు, తేలికపాటి సరుకు రవాణా వాహనాలు, మోటార్ కార్లు, మోటార్ క్యాబ్‌లు, మాక్సీ క్యాబ్‌లు, ఓమ్ని బస్సుల డ్రైవర్లతో పాటు డ్రైవింగ్‌స్కూల్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు. సుమారు 50 మంది డ్రైవర్లకు మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జె. అనిల్ కుమార్, హోంగార్డులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, రోడ్ల రకాలు, జాతీయ రహదారులపై సైనేజ్ బోర్డులు, టోల్ ప్లాజా సౌకర్యాలు, 100, 108, 1033, ఎస్ఓఎస్ సేవల వినియోగం, నగదు రహిత చికిత్స, రహ-వీర్ పథకం, ప్రమాద సమయంలో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత, గుడ్ సమారిటన్ పాత్ర తదితర అంశాలను వివరించారు. వాహనం నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ ధరించడం, సెల్‌ఫోన్ వినియోగించకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగం, ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండటం, మద్యం సేవించి వాహనం నడపకపోవడంవంటి జాగ్రత్తలను వివరించారు.వాహన రికార్డులు సక్రమంగా నిర్వహించడం, ఫిట్‌నెస్‌ను సకాలంలో తనిఖీ చేయించుకోవడం, ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికెట్లను సకాలంలో పునరుద్ధరించుకోవాలని,ఇతర రాష్ట్రాల వాహనాలను కొనుగోలు చేసే సమయంలో, వాహనాల్లో మార్పులు చేసే సందర్భంలో నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు.

పోషన్ భి పడాయిభి పై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీ కాళహస్తి టౌన్



బాయ్స్ హై స్కూల్ నందు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి రూరల్ మండలం అంగన్వాడి కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శాంతి దుర్గ ఆధ్వర్యంలో జరిగినది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ బాలయ్య గారు, హెడ్మాస్టర్ వెంకటయ్య గారు హాజరయ్యారు. ఆరు సంవత్సరాల లోపల పిల్లల యొక్క బాల్య రంభ పూర్ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశం. పుట్టిన వెంటనే బిడ్డ అభివృద్ధి, డెవలప్మెంట్ మైల్ స్టోన్స్, పోషన్ పక్వాడ, గ్రోత్ మానిటరింగ్, కమిటీ మేనేజ్మెంట్ ఆఫ్ మౌనరీస్మెంట్ చిల్డ్రన్, ఓషన్ ట్రాకర్ ఆప్ ని వాడకం, గృహ సందర్శనలో షెడ్యూలు గురించి తెలియ జేశారు. ఇందులో అంగన్వాడీ కార్యకర్తలు ద్వారా గ్రూప్ యాక్టివిటీస్ ప్రజెంటేషన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ ఆవరణంలో నడిరోడ్డుపైకి దూసుకొస్తున్న రేకులు పట్టించుకోని అధికారులు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణంలో నడిరోడ్డుపైకి రేకుల షెడ్లు దూసుకొస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పాత బస్టాండ్ ఆవరణంలో గతంలో టిఫిన్ సెంటర్ ఉండేది. అదే స్థానంలో ఇప్పుడు షాపును మరింత విస్తరించి, రోడ్డుపైకి దూసుకొచ్చేలా రేకులతో ఆల్టరేషన్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్ ఆవరణలోకి బస్సులు రాకపోకలు సాగించే దారి క్రమంగా కుంచించుకుపోతోంది.నిత్యం వందలాది బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో రేకుల విస్తరణ వల్ల ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు నడవడానికి కూడా స్థలం లేకుండా పోతోందని వాపోతున్నారు.ఇప్పటికే ఇరుకుగా ఉన్న రోడ్డుపై రేకులు మరింతగా ఆక్రమిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పట్టణవాసులు చెబుతున్నారు. సంబంధిత మున్సిపాలిటీ అధికారులు వెంటనే చొరవ తీసుకొని, నడిరోడ్డుపైకి దూసుకొస్తున్న ఈ రేకుల నిర్మాణాన్ని కట్టడి చేయాలని, ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ దాతృత్వం

నిస్వార్థంగా సహాయం చేసే గుణం కల్గిన నేత కోలా ఆనంద్



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఎలాంటి వ్యక్తిగత ఆశలు లేకుండా కేవలం తోటివారికి మరియు సమాజానికి సాయపడటం ఆయన దాతృత్వానికి మారుపేరు. అందులో భాగంగానే ఈ రోజు ఏర్పేడు మండలంలోని కోబాక పంచాయతీ నందు గల తిన్నాటి సుబ్రమణ్యం తీవ్ర అనారోగ్యంతో భాధ పడుతున్న ఆయనకు పదివేలు రూపాయలును కార్యకర్తల నడుమ ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ విధంగా బీజేపీ కార్యకర్తలు ఇబ్బందుల్లో వారిని ఆడుకోవాలని ఇది మానవజీవితాలను మెరుగుపరచడమే కాకుండా శాశ్వత సామాజిక మార్పునకు దారితీస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ చరవాణి ద్వారా కార్యకర్తలకు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయానంతరం ఎమ్మెల్యేను కలిసిన మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండలం నిడిగుర్తి ఎంపీటీసీ సెగ్మెంట్‌లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి, మండల కన్వీనర్, ఏఎంసీ వైస్ చైర్మన్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి మంగళవారం గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందించిన ప్రోత్సాహం, సహకారంతో నిడిగుర్తి సెగ్మెంట్‌లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించామని మధుసూదన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా వాకాడు మండలంలో కూటమి మద్దతుతో మెజార్టీ సెగ్మెంట్లలో విజయాలు సాధించామని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లాపు నాగరాజు, టీడీపీ నాయకులు కుంచ విజయరత్నం, తీపలపూడి రమణయ్య, నిడిగుర్తి, మూలపడవ పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు రెండు రోజుల 'పోషణ్ భీ - పడాయి భీ' శిక్షణ ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రాపురం



రామచంద్రాపురం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న రెండు రోజుల 'పోషణ్ భీ -- పడాయి భీ' పునశ్చరణ, బలోపేత శిక్షణ కార్యక్రమం కుప్పంబాదూరులోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్ యాదవ్ , ఈశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం అంగన్వాడీ కార్యకర్తల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, బాల్య సంరక్షణ మరియు విద్య (ఈ సి సి ఈ)ను బలోపేతం చేయడం, పోషణ్ ట్రాకర్‌లోని నూతన అంశాలు, దివ్యాంగ పిల్లల సమ్మిళిత విద్య, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా పుట్టినప్పటి నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాల్య ప్రేరణాత్మక కార్యకలాపాలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రాథమిక అభ్యాసం, ఆటలు, పాటలు, వివిధ బోధనా కార్యకలాపాల ద్వారా ప్రీ-స్కూల్ విద్య అందించే విధానాలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అలాగే పిల్లల అభివృద్ధి దశలను గుర్తించి, వారి వయస్సుకు అనుగుణంగా తగిన విద్యాబోధన అందించే సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మనీల, రేవతి ,మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్ 10
బుధవారం 11 నవంబరు 2026

ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు

మధ్యాహ్నం 1 గం.కు కో ఆప్షన్ సభ్యులు.. 3 గం.లకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక - చేతులెత్తే పద్ధతి ద్వారా ఓటింగ్ ప్రక్రియ.

ప్రజా భూమి, పుట్టూరు.

పరోక్ష ఎన్నికల ప్రత్యేక సమావేశం కోసం నవంబర్ 14వ తేదీలోగా సభ్యులకు నోటీసుల జారీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఎన్నికల రోజున మధ్యాహ్నం 1 గంటకు కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరుగనుండగా.. మధ్యాహ్నం 3 గంటలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఛైర్ పర్సన్, వైస్ ఛైర్ పర్సన్ల ఎన్నిక ప్రక్రియ చేపడతారు. ఎన్నికల రోజున ఉదయం 10 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అలాగే మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. 'చేతులెత్తడం' పద్ధతి ద్వారానే ఎంపీపీ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల విప్‌కు లోబడే సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది. పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేస్తే సభ్యత్వం రద్దు చేయనున్నారు. కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ నిబంధన వర్తించదు. అధ్యక్ష లేదా ఛైర్ పర్సన్ ఎన్నిక పూర్తయిన తర్వాతే ఉపాధ్యక్ష లేదా వైస్ ఛైర్ పర్సన్ ఎన్నిక నిర్వహిస్తారు. అనివార్య కారణాలతో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగకపోతే.. ఆ వెంటనే జరిగే అధ్యక్ష, ఛైర్ పర్సన్ ఎన్నికల సమావేశం రద్దు అవుతుంది. కోరం లేకపోతే... కోరం లేకపోయినా లేదా ఇతర కారణాలతో ఎన్నిక వాయిదా పడితే.. మరుసటి రోజు (సెలవు దినమైనా సరే) మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ నిర్వహిస్తారు. ఎన్నికల సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానించనున్నారు. అయితే వారికి ఎలాంటి ఓటు హక్కు ఉండదు. పార్టీ విప్‌గా వ్యవహరించే వ్యక్తుల వివరాలను ఎన్నికకు ముందు రోజు ఉదయం 11 గంటలలోగా ప్రిసైడింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల పారదర్శకత కోసం వీడియో చిత్రీకరణ, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా లైవ్ కవరేజీకి అనుమతి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

ఎన్నికల వేళ గ్రామాల్లో పోలీసుల అవగాహన

శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా -ఎస్పై ప్రసాద్



ప్రజా భూమి శింగనమల మండలం పరిధి నాగులగుడ్డం తండా గ్రామాన్ని ఎస్పై ప్రసాద్ సందర్శించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన చేయాల్సినవి, చేయ కూడనివి గురించి అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలకు సూచించారు. అల్లర్లు, గొడవలకు పాల్పడటం, తదితర చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సున్నిత గ్రామాల్లో నిరంతర నిఘా, పోలీసుల ఫుట్ పెట్రోలింగ్ కొనసాగుతుందని తెలిపారు.

గెలిపించిన ప్రజల వద్దకు గడపగడపకూ వెళ్లి ఆత్మీయ పలకరింపు..!

ప్రజల ఆదరణే మా బలం.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన స్వాతిలతా రెడ్డి, ప్రసన్నకుమారి

ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఘన విజయం సాధించిన నార్పల 3వ ఎంపీటీసీ స్వాతిలతా రెడ్డి (కాబోయే ఎంపీపీ), నార్పల 4వ ఎంపీటీసీ ప్రసన్నకు మారి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రజాప్రతినిధులు తమను ఆదరించి, అఖండ విజయాన్ని అందించిన ఓటర్ల వద్దకు గడపగడపకూ వెళ్లి ఆత్మీయంగా పలకరిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు చూపించిన ప్రేమాభిమానాలు, నమ్మకం, ఆదరణ తమకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని వారు పేర్కొన్నారు. ప్రజలు అందించిన ఈ విజయాన్ని ఎప్పటికీ మరిచిపోమని, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనుబాధ్యతగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని భరోసా కల్పించారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామని వెల్లడించారు. తమ విజయానికి సహకరించిన ప్రతి ఓటరుకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గెలుపు తర్వాత కూడా ప్రజల మధ్యే ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్వాతిలతా రెడ్డి, ప్రసన్నకుమారి పేర్కొన్నారు.



గ్రామ పంచాయతీల నామినేషన్ల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- : జిల్లా కలెక్టర్ - జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా నిర్వహించే నామినేషన్ల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ సూచించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, జోనల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు జోనల్ ఆఫీసర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా






నిర్వహించాలన్నారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ఆయా గ్రామ పంచాయతీలలో నోటిఫికేషన్‌ను ప్రకటించడం, నామినేషన్లను స్వీకరించడం, నామినేషన్లను పరిశీలించి ఫైనల్ చేయడం, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించడం లాంటి విధులను స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు నిర్వర్తించాల్సి ఉండగా, వారికి కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఇంతకు ముందు జరిగిన ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో నామినేషన్ల ప్రక్రియలో కొన్ని సంఘటనలు జరిగినందున, స్టేజ్-1 అధికారులు చాలా జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎవరికైనా ఇబ్బందులు వస్తే వాటిని నిష్పక్షపాతంగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులకు అస్కారాలు లేకుండా, నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను సజావుగా కొనసాగించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కల్యాణదుర్గం, అనంతపురం, గుంతకల్లు డిడిఓలు, స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, జోనల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి శాస్త్రవేత్త శంకర్‌కు సన్మానం

తెలుగు వారు గర్వించదగిన శాస్త్రవేత్త -ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజా భూమి, కడప అర్బన్

ఆచార్య ఎం.వి.శంకర్ వరుసగా ఆరు సంవత్సరాలు ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తలలో ఒకరుగా గుర్తింపు సాధించారని, తెలుగు వారు గర్వించదగిన శాస్త్రవేత్తని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో మెటీరియల్ సైన్సు, నానో టెక్నాలజీ విభాగంలో ఆచార్యులుగా పని చేస్తున్న ఎం.వి.శంకర్ అత్యుత్తమ అంతర్జాతీయ పరిశోధకులకు ఇచ్చే ప్రతిష్టాత్మక బ్రెయిన్ పూల్ ఫెలోషిప్ కింద దక్షిణ కొరియాలో కొంకుక్ విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల సహకార పరిశోధనను పూర్తిచేసి మాతృ విశ్వవిద్యాలయానికి వచ్చిన సందర్భంగా వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం, వేమన నగర్ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో



ఆచార్య ఎం.వి.శం కర్ ను మంగళవారం ఉదయం10 గంటలకు జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో ఘనంగా నన్మానించారు. అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తగా గుర్తింపు సంపా దించుకున్న శంకర్ సాధించిన ముఖ్యమైన విజయాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెరిటో రియస్, రాష్ట్ర శాస్త్రవేత్త అవార్డ్ ఉన్నాయని, ఆయనకు లండన్ లో రాయల సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోషిప్ ఉందన్నారు. ముఖ్య అతిథి ఎస్.కే.ఆర్, ఎస్.కే.ఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుగవాసి స్మిత ప్రసంగిస్తూ ఎంవి శంకర్ తన పరి శోధన సమయంలో హైడ్రోజన్ ఉత్పత్తి, కాలుష్య కారకాల విచ్ఛిన్నం కోసం అత్యంత సమర్థవంతమైన ఫోటో క్యాటలిటిక్ పదార్థా లను అభివృద్ధి చేయడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నా రు. వై.వి.యు రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు ఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ఎంవి శంకర్ దక్షిణ కొరియాలో జరిగిన అంత ర్జాతీయ సదస్సులలో ఆహ్వా నిత ప్రసంగాల ద్వారా తమ పరిశోధన ఫలితాలు సమర్పించారని, వై వియు, కొరియా విశ్వవిద్యాలయాల మధ్య సహకార పరిశోధన కార్యకలాపాలపై చర్చలను ప్రా రంభించారన్నారు. వై.వి.యు జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆచార్య వి సునీత ప్రసంగిస్తూ కొరియా ప్రొఫెసర్లు, శాస్త్రవేత్త లు, పరిశోధకులు, విద్యార్థులతో యం వి శంకర్ జెరిపే సంభాషణలు భవిష్యత్తులో విద్య, పరిశోధన సహకారాలను బలోపే తం చేస్తాయని భావిస్తున్నానన్నారు. కార్య క్రమంలో డా:వెంకటేశ్వరాచారి, తప్పెట కొండారెడ్డి, పేర్ల శివారెడ్డి, సుగూరు విశ్వ నాథ్, పల్లెం రమేష్ బాబు పాల్గొన్నారు.

దౌర్జన్యం మెడలు వంచిన ప్రజాస్వామ్యం-డా.యం.ఉమేష్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

గత కొన్ని దశాబ్దాలుగా దాడులు, దౌర్జన్యాలను ఆసరాగా చేసుకొని రాజకీయ పబ్బం గడుపుకుంటున్న వైయస్ కుటుంబ నియంతృత్వం సృష్టించిన అడ్డంకులను అధిగమించి, వెన్ను చూపకుండా ఎదిరించి పులివెందుల దౌర్జన్యం మెడలు వంచిన ప్రజాస్వామ్యానికి వేల వేల దండాలు సమర్పిస్తున్నామని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తెలిపారు.

అరాచకాన్ని జయించిన ఆనందమ్మ విజయం స్ఫూర్తిదాయకం

గత వైసిపి ప్రభుత్వ పాలనలో జరిగిన ప్రాదేశిక ఎన్నికలలో తొట్టంబేడు ప్రాదేశిక స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున చిల్లకూరు ఆనందమ్మ సమర్పించిన నామినేషన్‌ను అరాచకపు వైసిపి మూకలు అక్రమంగా తిరస్కరించి, బయటకు గెంటేసి వైసిపి వారు ఏకగ్రీవం చేసుకున్నారని, సరిగ్గా ఐదేళ్ళ తరువాత అదే చిల్లకూరు ఆనంద మ్మను తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు ప్రాదేశిక సభ్యురాలిగా నిలబెట్టగా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కలిగిన ఓటరు మహాశయుల ఆశీస్సులతో ఆనంద మ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా చిల్లకూరు ఆనందమ్మ సాధించిన స్ఫూర్తిదాయకమైన విజయం ప్రజాస్వామ్యం యొక్క గొప్పదనాన్ని తెలియజేసిందని పేర్కొన్నారు.అనంతరం స్థానిక జయరాంరావు వీధి లోని,



తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్ డా. నివేదిత మోరె ఆధ్వర్యంలో ఆనందమ్మ ని ఘనంగా సత్క రించారు.

సామాజిక న్యాయం టిడిపితోనే సాధ్యం

స్వర్గీయ నందమూరి తారక రామారావు చేతుల మీదుగా పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీ తోనే సామాజిక న్యాయం, పేదలకు రాజ్యాధికారం సాధ్యమని భావించి, గడచిన నాలుగు దశాబ్దాలుగా త్రికరణ శుద్ధిగా బలహీన వర్గాలకు ప్రజా ప్రతినిధులుగా అవకాశాలు కల్పిస్తున్నదని కొనియాడారు. ఇదే క్రమంలో సియం చంద్రబాబు నాయుడు కూడా బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారం అందించేలా, ప్రస్తుతం జరిగిన పురపాలక ఎన్నికలలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ, తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నిక కాబడిన మొత్తం 70 మంది ఛైర్మన్ మరియు మేయర్ లలో 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందినవారే. ప్రత్యేకించి బీసీ వర్గానికి చెందిన వారికి 35.7% శాతంతో దాదాపు 25 పదవులు కేటాయించడం సామాజిక మరియు రాజకీయ చరిత్రలో నిలిచిపోయే చిరస్మరణీయ ఘట్టం అని కొనియాడారు.

ప్రజాస్వామ్యం అండగా పరుగెడుతున్న ప్రగతి అటు పల్లెటూరి నుంచి నగరాల వరకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలతో పరుగులు పెడుతున్న ప్రగతికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకం ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచి, ప్రజాస్వామ్య విజయాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ ప్రజల చైతన్యవంతమైన స్ఫూర్తిని కొనియాడారు. అలాగే జిల్లా మరియు మండల ప్రాదేశిక ఎన్నికలలో ఎన్డీయే కూటమికి ఘనవిజయాన్ని అందించిన సియం చంద్రబాబు నాయుడు నాయకత్వం, పవన్ కళ్యాణ్ అండ, నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ముందుకు పరిగెడుతున్న ప్రగతి పాలనకు ప్రజాస్వామ్య వాదులు మరోసారి మద్దతుగా నిలిచి జై కొట్టారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తొట్టంబేడు ఎంపిటీసి చిల్లకూరు ఆనందమ్మ, శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, డిల్లీ బాబు, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, శంకరయ్య, సులేమాన్, గాజుల భగత్, గగన్ యాదవ్, ముని, భువన, అయ్యప్ప, చంద్రబాబు, సుబ్బు, రాకేష్, శివ, గోపీ యాదవ్, నాగరాజు, సుబ్బయ్య, రవితేజ, బాలు, శీను తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధి, పోషకాహారం అందించడమే లక్ష్యం

- పోషణ్ భీ.. పఢాయి భీ పై శిక్షణ- సిడిపిఓ వి.సునిత

ప్రజాభూమి, వేంపల్లె



చిన్నారుల సమగ్ర అభివృద్ధి, పోషకాహారం, ఆటపాటల ద్వారా విద్యా బోధన అందిం చడమే పోషణ్ భీ..పఢాయి భీ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వేంపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వి.సునిత అన్నారు. మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ..వఢాయి భీ కార్యక్రమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక దశలో పూర్వ ప్రాథమిక విద్యా, ఆరోగ్య సంరక్షణ, శారీరక, మానసిక వికాసం, ఎదుగుదల, వయసుకు తగిన అభ్యాసన పద్ధతులు, ఆటపాటలు, వివిధ కార్యక్రమాల ద్వారా విద్యా బోధన అందించేందుకు 2 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలు కేవలం ఆహార కేంద్రాలు కాకుండా పూర్వ ప్రాథమిక విద్యా నేర్పించే కేంద్రాలుగా మార్పు తీసుకురావాలని అంగన్వాడీ కార్యకర్తలకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ వెంకట్రామిరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు డా.స్వర్ణలత, సుభద్ర, హసినా తదితరులు పాల్గొన్నారు.

రణధీరపురం ఎంపీటీసీగా తుంటి సుమలత విజయం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి (మంగళం)



తిరుపతి జిల్లా మంగళంలోని రణధీర్ పురం పంచాయతీ వైయస్సార్సీపి ఎంపీటీసీగా తుంటి సుమలత విజయం సాధించారు. కూటమి అధికా రంలో ఉన్నప్పటికీ టిడిపితో పోటాపోటీ పడి ఎంపీటీసీగా ఉంది సుమలత 166 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తుంటి సుమలతతో పాటు ఆమె భర్త తుంటి సుధా యాదవ్ కు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి రూరల్ జెడ్పిటిసి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

శ్రీ వాయు లింగేశ్వర స్వామి వారి సేవలో కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్ కుటుంబ సభ్యులు

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమును భారత ప్రభుత్వ మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్ సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని, రాహు--కేతు సర్పదోష నివారణ పూజను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని వేద పండితులచే వేదాశీర్వచనం స్వీకరించారు.ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు , ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి , ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు దగ్గరుండి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించి, అమ్మవారి ఆశీస్సులు, స్వామివారి తీర్థప్రసాదాలు మరియు శేషవస్త్రాన్ని అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా నిత్య లక్షార్చన ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి నిత్య లక్షార్చన వైభవంగా ప్రారం భించారు.ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని నిత్య లక్షార్చన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి , పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ , ప్రదాన అర్చకులు సంబందం గురుకులు , కరుణాకర్ గురుకుల్ దేవస్థాన సిబ్బంది అంధరు పాల్గొన్నారు కార్తీక మాసం శివారాధనకు అత్యంత విశిష్టమైన మాసం కావడంతో ఈ పవిత్ర మాసంలో స్వామివారికి బిల్వదళాలతో, అమ్మవారికి కుంకుమతో విశేష అర్చనలు నిర్వహిస్తున్నారు. ఈ పూజల ద్వారా లోకకల్యాణం, సకల జనుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.కార్తీక మాసం సందర్భంగా దేవస్థానంలో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రజాభూమి
పోలవరం
11
బుధవారం 11 నవంబరు 2026

ఎంపీపీలు, జెడ్పీటీసీల పరోక్ష ఎన్నికలకు

రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ

- ఈ నెల 19న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు
- 20న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక
- 12 మండల పరిషత్‌లు, ఒక జిల్లా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలతో పాటు పరోక్ష ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లా పరిధిలోని 101 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ), 12 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల (జెడ్పీటీసీ) సభ్యుల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 5వ తేదీన పోలింగ్ నిర్వహించగా, ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసి ఫలితాలను ప్రకటించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని 12 మండల ప్రజా పరిషత్‌లు, ఒక జిల్లా ప్రజా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం (10.11.2026) నోటిఫికేషన్లు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం ఈ నెల 19వ తేదీన మండల ప్రజా పరిషత్‌లలో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికతో పాటు ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఈ నెల 20వ తేదీన జిల్లా పరిషత్‌లో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె దినేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు నిర్ణీత తేదీల్లో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తారనీ తెలియ చేయడం జరిగింది.

ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అదేవిధంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు. ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కో-ఆప్టెడ్ సభ్యులు మతపరమైన మైనారిటీ లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులై ఉండాలి. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కంటే ముందుగా కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికను నిర్వహిస్తారు.ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు జరిగే ఎన్నికలను చేతులు పైకెత్తి ఓటు వేసే విధానంలో నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికల సందర్భంగా సంబంధిత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సభ్యులకు జారీ చేసే పార్టీ విప్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికల విషయంలో పార్టీ విప్ వర్తించదనీ తెలిపారు.సంబంధిత మండల, జిల్లా పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు (ఎంపీలు), శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీలు), శాసనసభ సభ్యులు (ఎమ్మెల్యేలు) ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యేందుకు ఆహ్వానించబడతారనీ, అయితే వారికి ఈ పరోక్ష ఎన్నికల్లో ఓటు వేసే హక్కు ఉండదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.నిర్ణీత ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న నిర్వహించనున్న ఎంపీపీ ఎన్నికలు, 20న నిర్వహించనున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14వ తేదీలోగా అందచేయడం జరుగుతుందనీ తెలియ చేశారు. పరోక్ష ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమగ్ర మార్గదర్శకాలు, విధివిధానాలను జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన రెండు నోటిఫికేషన్లు, వాటిలో పేర్కొన్న మార్గదర్శకాలు, ఎన్నికల విధివిధానాలను పూర్తిస్థాయిలో అనుసరిస్తూ నూతనంగా ఏర్పాటు చేసిన పోలవరం తొలిసారిగా జిల్లాలోని 12 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లో పరోక్ష ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

అడ్డతీగల రేంజ్ కార్యాలయంలో ఘనంగా రాష్ట్రీయ అటవీ అమరవీరుల దినోత్సవం





ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడ్డతీగల అటవీ రేంజ్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్రీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అటవీ శాఖ అమరవీరుల సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడ్డతీగల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. యోగేంద్రం మాట్లాడుతూ.. అటవీ సంపదను, వన్యప్రాణులను సంరక్షించేందుకు అటవీ శాఖ సిబ్బంది ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, వ్యక్తిగత సుఖాలను పక్కనపెట్టి రాత్రింబవళ్లు అడవుల్లోనే గడుపుతూ ప్రకృతి పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో ఎంతోమంది అటవీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. అటవీ అమరవీరుల సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.అటవీ విధులు నిర్వహించే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తగిన భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో తోటి సిబ్బంది సమన్వయం, సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్డతీగల, వై. రామవరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, అటవీ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పకడ్బందీగా జనాభా లెక్కల సేకరణ..

- సేకరించే ప్రతి సమాచారం ఖచ్చితత్వంతో ఉండేలా అధికారులు పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి..
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్..

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఎన్నికలంతటి ప్రాధాన్యత కలిగిన ఈ సర్వేలో సేకరించే ప్రతి సమాచారం ఖచ్చితత్వం తో ఉండేలా అధికారులు పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో భారత ప్రభుత్వ జనాభా లెక్కల డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారులకు జనాభా లెక్కలు 2027 రెండవ దశ, జనాభా నమోదు కార్యక్రమం పై రెండు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.. డీఆర్వో డా.డి.తిప్పే నాయక్, హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ జేడీ జీవీ చంద్రకళ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండో దశ జనాభా లెక్కల సేకరణలో జిల్లా స్థాయి, చార్జ్ స్థాయి అధికారులు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సెన్సెస్ జీవీ చంద్రకళ.. మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్లు ఇతర సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో పకడ్బందీగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ 2027 జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని,ఇది ఎన్నికలంతటి ప్రాధాన్యత కలిగిన బాధ్యత అని స్పష్టం చేశారు. సేకరించే ప్రతి సమాచారము అత్యంత ఖచ్చితత్వంతో ఉండాలని, ఎటువంటి తప్పులకు తావులేకుండా ప్రతి అంశాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. ఈ జనగణలో జిల్లా,చార్జ్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సేకరణలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఏ వివరాలను సేకరిస్తున్నామో పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. మాతృభాష వంటి అంశాలను సేకరించేటప్పుడు ఎటువంటి పొరపాట్లు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఈ శిక్షణా కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏవైనా సందేహాలుంటే అక్కడి కక్కడే నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది ఈ ప్రక్రియను తేలికగా తీసుకోవద్దని, ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర వివరాలను సేకరించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైఉందనన్నారు. ఎక్కడైనా కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోతే రెండు, మూడు సార్లు సందర్శించి కచ్చితంగా వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జనాభా లెక్కల ద్వారా సేకరించిన సమాచారమే ప్రభుత్వ ఆర్థికనిర్ణయాలకు, వివిధ సంక్షేమ పథకాల అమలుకు,



భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు అత్యంత కీలకంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ అంశం దృష్టిలో ఉంచుకుని సేకరించే ప్రతి అంశము స్పష్టమైనదిగా, నూటికి నూరు శాతం కచ్చితమైనదై ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి నెలలో జనాభా నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ రెండు రోజుల శిక్షణ ద్వారా పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

జనాభా లెక్కల ప్రక్రియ దేశాభివృద్ధికి అత్యంత కీలకం:
డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ జేడీ జీవీ చంద్రకళ

దేశంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ దేశాభివృద్ధికి అత్యంత కీలకమైనదని హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ జేడీ జీవీ చంద్రకళ స్పష్టం చేశారు. ఇది కేవలం సాధారణ గణాంక సేకరణ మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును నిర్దేశించే అతిపెద్ద పరిపాలనా పరమైన మహా యజ్ఞమనన్నారు ఎన్నికలలో కేవలం పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వయోజనులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని, కానీ జనాభా లెక్కల్లో మాత్రం పుట్టిన ప్రతి చిన్నారి నుంచి సమాజంలోని ప్రతి ఒక్కరూ విధిగా భాగమవుతారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత దేశం ఉన్నందున, ఈ దేశాభివృద్ధి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సైనికుడిలా తమ దేశభక్తిని చాటుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నూతన రాష్ట్రంగా ఏర్పడిన మన ప్రాంతానికి, అలాగే కాకినాడ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక వనరులు, నిధులు సక్రమంగా రావాలంటే ఈ జనాభా లెక్కల సేకరణే ప్రాతిపదిక అని చంద్రకళ వివరించారు. రాష్ట్రానికి రావలసిన ప్రతి పైసా దక్కాలంటే ఈ ప్రక్రియను అధికారులు అత్యంత బాధ్యతతో నిర్వహించాలన్నారు.సర్వే చేపట్టే సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వ కుండా, అర్హులైన ఎ ఒక్కరి పేరు విడిచిపోకుం డా అలాగే ఒకే పేరు రెండుసార్లు నమోదు కాకుండా పకడ్బందీగా పాపులేషన్ గణన పూర్తి చేయాలని కోరారు.ఈ శిక్షణ కార్యక్ర మంలో సీపీవో పి.త్రినాథ్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం వివిధ స్థాయిల ఛార్జ్ అధికారులు, అసిస్టెంట్ ఛార్జ్ అధికారులు, సాంకేతిక సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

అర్నబ్ తుఫాను ప్రభావంతో సముద్ర అలల ఉధృతికి దెబ్బతిన్న వాకలపూడి-ఎదటం రాష్ట్ర రహదారి (ఎస్‌హెచ్--162)ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని సుబ్బంపేట, కోనపాపపేట గ్రామాల వద్ద సముద్ర అలల తాకిడికి కొట్టుకుపోయిన రహదారి ప్రాంతాలను ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి పరిశీలించి, నష్టాన్ని సమీక్షించారు.సుమారు 46 కిలోమీటర్ల పొడవున్న ఈ రాష్ట్ర రహదారి కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి,తొండంగి మండలాల్లోని నేమాం, కొమరగిరి, సుబ్బంపేట, ఉప్పాడ, కోనపాపపేట తదితర తీరప్రాంత మత్స్యకార గ్రామాలను జిల్లా కేంద్రం కాకినాడతో అనుసంధానిస్తుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తుఫాను సమయంలో సముద్రంలో ఏర్పడిన తీవ్ర అలల కారణంగా సుబ్బంపేట,కోనపాపపేట ప్రాంతాల్లో



సుమారు 4 నుంచి 5 మీటర్ల లోతు వరకు రహదారి,కట్ట కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

విద్యుత్ స్తంభం ఎక్కి షాక్‌కు గురైన యువకుడు.. తీవ్ర గాయాలు



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలం ఇ రామవరం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు గ్రామంలో గత రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే క్రమంలో చుప్పరపాలెం గ్రామానికి చెందిన వెలుగుల పండురెడ్డి(24) విద్యుత్ స్తంభం ఎక్కాడు ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు సమాచారం అందుకున్న108సిబ్బంది ఈఎంటీ ఏ.లక్ష్మి,పైలట్ పి.రాఘవులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రాథమిక సహాయం అందించారు విద్యుత్ స్తంభాలు ఎక్కే సమయంలో తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి మాత్రమే సమాచారం అందించాలని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఇంచార్జ్ మేజిస్ట్రేట్ ఎం.మురళీధరరావు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

డిసెంబర్ 12, 2026న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జ్ మేజిస్ట్రేట్ ఎం. మురళీధరరావు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం అడ్డతీగల, రాజమ్మంగి, జడ్డంగి, దుచ్చర్తి, వైరామవరం పోలీస్ స్టేషన్ల ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు సహకరించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా చేసుకోవడంతో పాటు న్యాయపరమైన సమస్యలకు సత్వర పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

అడ్డతీగలలో మెగా వైద్య శిబిరం

-250 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల గ్రామంలోని సీతారామరాజు కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో మొత్తం 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరమైన 10 మందిని గుర్తించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు వైద్య బృందం నిర్ణయించింది.ఈ వైద్య శిబిరంలో ఆరుగురు వైద్యులు, 10 మంది సిబ్బంది పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి, తగిన వైద్య సలహాలు, చికిత్స అందించారు.ఈ మెగా వైద్య శిబిరాన్ని పాస్టర్ నిస్సి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పేద, నిరుపేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత ఆపరేషన్లు అందించేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గంగవరం సెంటర్ వీధిలో డ్రైనేజీ సమస్య.. పట్టించుకోని అధికారులు!

మురుగునీటితో స్థానికులకు అవస్థలు - దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఆందోళన

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం





గంగవరం మండల కేంద్రంలోని గంగవరం గ్రామ సెంటర్ వీధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారింది. డ్రైనేజీ కాలువలు పూడుకుపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లే మార్గం లేక రోడ్డుపై నిలిచిపోతోంది దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది అంతేకాకుండా నిల్వ ఉన్న మురుగునీటితో దోమలు విపరీతంగా పెరిగి మలేరియా,డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ సమస్యపై సంబంధిత అధికారులు దృష్టి సారించి,డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించి మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు ప్రజల ఆరోగ్యంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు

ప్రజాభూమి

జనరల్

బుధవారం, నవంబర్ 11, 2026

12

ఈవీఎం గోదాము తనిఖీ చేసిన కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదామును మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవీఎంలు భద్రపరచిన గోదాము, వాటి సీళ్లు, సెక్యూరిటీ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి రిజిస్టర్ లో సంతకం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కలెక్టర్ వెంట డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, ఈవీఎం నోడల్ అధికారి మార్కెటింగ్ ఎడి నిత్యానంద్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

49వ సారి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిన స్వచ్ఛ చల్లపల్లి సైనికుడు నరసింహారావు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

ఉద్యోగానికి రిటైర్మెంట్ ఉంటుందేమో కానీ, సమాజ సేవకు, ప్రాణాలను నిలిపే మానవత్వానికి ఏనాడూ విశ్రాంతి ఉండదని చేతల్లో నిరూపిస్తున్నారు బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి నరసింహారావు. నేడు ఆయన 49వ సారి రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారికి ప్రాణం పోయాలన్న సంకల్పం ఉంటే వయసు ఏమాత్రం అడ్డంకి కాదని మరోసారి చాటిచెప్పారు.ఆయన కేవలం రక్తదాత మాత్రమే కాదు, దివిసీమ గడ్డపై నిస్వార్థ ప్రజాసేవకు మారుపేరుగా నిలిచిన స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమంలో ఒక క్రియాశీలక సైనికుడు. చల్లపల్లిని పరిశుభ్రంగా, పచ్చదనంతో కళకళలాడేలా తీర్చిదిద్దేందుకు ఆదివారం, సెలవు రోజనే తేడా లేకుండా చేతుల్లో చీపుర్లు, పారలు పట్టి రోడ్లు ఊడ్చడం, పిచ్చిమొక్కలు తొలగించడం, మొక్కలు నాటి సంరక్షించడం వంటి పనుల్లో స్వచ్ఛ చల్లపల్లి వాలంటీర్లతో కలిసి అయన నిరంతరం శ్రమిస్తున్నారు. గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో ఎంతటి అంకితభావం చూపిస్తారో, తోటి మనిషి ప్రాణాపాయంలో ఉన్నప్పుడు రక్తం అందించి కాపాడటంలోనూ అంతే ముందుంటారు.నేటి యువత సైతం రక్తదానానికి సంకోచిస్తున్న తరుణంలో, పదవీ విరమణ పొందిన తర్వాత కూడా సమాజ హితం కోసం నిరంతరం పరితపించే నరసింహారావు సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయం. త్వరలోనే 50వ సారి రక్తదాన మైలురాయిని చేరుకోబోతున్న ఈ స్వచ్ఛ సైనికుడి నిస్వార్థ సేవలను తోటి కార్యకర్తలు, గ్రామస్తులు ప్రశంసిస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేనకు అత్యధికముగా 59.9 శాతం ఓట్లు



సామాజిక న్యాయానికి జనసేన ప్రాధాన్యత ఇచ్చింది
జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

జనసేన పార్టీకి అవనిగడ్డ నియోజకవర్గంలో అత్యధికముగా 59.9 శాతం ఓట్లు ఇచ్చారని జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ తెలిపారు. మంగళవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున పోటీ చేసిన 32 మంది అభ్యర్థులు 40,714 ఓట్లతో 59.09 శాతం ఓట్ షేరింగ్ సాధించారని, టీడీపీ అభ్యర్థులు 37 మంది 40,547 ఓట్లతో 57.22 శాతం ఓట్ షేరింగ్ సాధించారని తెలిపారు. వైసీపీ పోటీ చేసిన 65 స్థానాల్లో 47,126 ఓట్లతో 35.93 శాతానికి పరిమితమైందన్నారు. జనసేన పార్టీ తరపున ఎస్సీ, బీసీ అభ్యర్థులు జడ్పీటీసీలుగా గెలుపొందారన్నారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున నలుగురు ఎస్సీ అభ్యర్థులు, ఇద్దరు బీసీ యాదవ అభ్యర్థులు, ఇద్దరు బీసీ అగ్నికుల క్షత్రియ అభ్యర్థులు, ఒక బీసీ రజక అభ్యర్థి, ఒక బీసీ గౌడ, ఒక బీసీ ముదిరాజు అభ్యర్థి, ఒక ఆర్యవైశ్య అభ్యర్థులు గెలిచారని తెలిపారు.

నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థులు ఎనిమిది మంది వెయ్యికి పైగా ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించారని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గెలుపొందిన 25 స్థానాల్లో 40,547 ఓట్ల మెజారిటీ సాధించారు. కోడూరు మండలంలో పోటీ చేసిన ఏడు ఎంపీటీసీ స్థానాలను జనసేన పార్టీ అభ్యర్థులు గెలుపొంది 100% స్ట్రైక్ రేట్ సాధించారని తెలిపారు. అవనిగడ్డ మండలంలో వేకనూరు సెగ్మెంట్లో 1,564 ఓట్ల మెజారిటీ, దక్షిణ చిరువోలులంక సెగ్మెంట్లో 1,368 ఓట్ల మెజారిటీ, అవనిగడ్డ-3 సెగ్మెంట్లో 1,165 ఓట్ల మెజారిటీతో గెలుపొందారని వివరించారు. ఘంటసాల మండలంలో పోటీ చేసిన మూడు ఎంపీటీసీ స్థానాలను జనసేన పార్టీ అభ్యర్థులు గెలుపొందారని, ఈ మండలంలో అత్యధిక మెజారిటీ 1,172 ఓట్లను శ్రీకాకుళం జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి సాధించారని తెలిపారు.

అవనిగడ్డ, కోడూరు, చల్లపల్లి మండలాల్లో మిత్రపక్ష పార్టీ టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థులు, నాగాయలంక మండలంలో మిత్రపక్ష బీజేపీ జడ్పీటీసీ అభ్యర్థి గెలుపు సాధించడంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు గణనీయమైన పాత్రను పోషించి అఖండ విజయాలు చేకూర్చారన్నారు. సామాజిక న్యాయాన్ని పాటించి ఘంటశాల జడ్పీటీసీ స్థానం ఎస్సీ సామాజిక వర్గానికి, మోపిదేవి జెడ్పిటిసి స్థానాన్ని బీసీ గౌడ వర్గానికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించినట్లు తెలిపారు. ఈ ఫలితాలు ప్రజలకు కూటమి పట్ల, జనసేన పార్టీ పట్ల ఉన్న విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, ఎంపీటీసీలు గుడివాక శేషుబాబు, పండ్రాజు లంకమ్మ ప్రసాద్, మత్తి రాజీవ్, తుంగల శ్రీలక్ష్మి, నాయకులు బొప్పన భాను, బచ్చు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మేయర్ అబ్దుల్ అబీదా, బేగ్‌లకు "గోపు" శుభాకాంక్షలు



ప్రజాభూమి ప్రతినిధి. మచిలీపట్నం: మచిలీపట్నం నగర మేయర్ అబ్దుల్ అబీదా, హసీం బేగ్‌లను తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ మచిలీపట్నం నగర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగించాలని ఆకాంక్షించారు. నగర ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు.అలాగే ప్రజాప్రతినిధులుగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సావధానంగా ఆలకించి సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిం చాలని ఆకాంక్షించారు. మచిలీపట్నం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. నూతన బాధ్యతల్లో వారు మరిన్ని విజయాలు సాధించి ప్రజల మన్ననలు పొందాలని గోపు సత్యనారాయణ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీమ్, జిల్లా కార్యదర్శి వసంత కుమారి, జిల్లా ఐటీడీపీ ఉపాధ్యక్షుడు రియాజ్ మొహమ్మద్, క్లస్టర్ ఇన్‌చార్జి తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం

జీవో 53 విడుదలపై ఉద్యోగ సంఘాల హర్షం.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 53 విడుదల చేస్తూ సుమారు 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసు లకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేయడంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడినప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల సీపీఎస్ విధానంలోకి వచ్చిన ఉద్యోగులకు ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం కలగనుంది. ఇందులో 7,361 మంది ఉపాధ్యాయులు, 1,832 మంది పోలీసులు, 1,800 మంది గ్రూప్-1, గ్రూప్-2 అధికారులు కలిపి సుమారు 11 వేల మందికి పాత పెన్షన్ విధానం అమలుకానుంది. కేంద్ర ప్రభుత్వ మెమో 57ను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంపై ఏపిసిపిఎస్ ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు పేపేటి సత్యనారాయణ, ఏపిసిపిఎస్ ఈఏ కృష్ణా జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ నాంచారయ్య హర్షం వ్యక్తం చేశారు.గతంలో కూడా సీపీఎస్ ఉద్యోగులకు కుటుంబ పెన్షన్ అందించిన తొలి రాష్ట్రంగా, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా తాజా నిర్ణయం ఉందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమలుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, మంత్రి నారా లోకేష్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు పేపేటి సత్యనారాయణ, కొక్కిలిగడ్డ నాంచారయ్య, ఉల్లి దీపక్, తుమ్మూరు శేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే మిగిలిన సీపీఎస్ ఉద్యోగులందరికీ కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

రైతులకు, రేషన్ కార్డుదారులకు తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యం

10 రైతు బజార్లు, 30 రైస్ మిల్లుల కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు





ప్రజా భూమి ప్రతినిధి, మచిలీపట్నం:

కృష్ణా జిల్లాలో రేషన్ కార్డుదారులకు తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 10 రైతు బజార్లు, 30 రైస్ మిల్లుల కౌంటర్ల ద్వారా బీపీటీ, కేఎన్ఎం రకాల బియ్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ బియ్యం కిలో రూ.49, కేఎన్ఎం బియ్యం కిలో రూ.50 చొప్పున అంది స్తున్నారు. ప్రతి కుటుంబానికి 26 కిలోల ప్రత్యేక ప్యాకింగ్‌తో బియ్యం పంపిణీ చేస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 17,340 రేషన్ కార్డుదారులకు 1,615.65 క్వింటాళ్ల బీపీటీ బియ్యం, 1,769.57 క్వింటాళ్ల బియ్యం విక్రయించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా 1,959 మంది వినియోగదారులకు 451.10 క్వింటాళ్ల కేఎన్ఎం బియ్యం, 68.90 క్వింటాళ్ల బీపీటీ బియ్యం కలిపి మొత్తం 520 క్వింటాళ్ల బియ్యం విక్రయించినట్లు వెల్లడించారు. రైతు బజార్లు, రైస్ మిల్లుల వద్ద బియ్యం నిల్వలు అందుబాటులో ఉంచి, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విక్రయాలు నిర్వహించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికా రులు సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చల్లపల్లిలో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు





కూరగాయల దుకాణంపైకి దూసుకెళ్లిన బస్సు.. ధ్వంసమైన యాక్టివా

ప్రజాభూమి ప్రతినిధి చల్లపల్లి:

స్టీరింగ్ తిరగకపోవడంతో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు రోడ్డుపక్కన ఉన్న కూరగాయల దుకాణంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అక్కడ పార్కింగ్ చేసి ఉన్న యాక్టివా ద్విచక్రవాహనం ధ్వంసమైంది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.బస్సు అదుపుతప్పి దుకాణంపైకి దూసుకెళ్లడంతో అక్కడ కొద్దిసేపు ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ప్రమాద సమయంలో దుకాణం వద్ద ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి కృష్ణా జిల్లాలోని కర అగ్రహారం, కృతివెన్ను, మచిలీపట్నం రూరల్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆక్వా రంగానికి విద్యుత్ సరఫరా అందించే విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సీఎండీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురసు తుఫాన్ ప్రభావంతో ఆయా విద్యుత్ మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని, చేపట్టిన మరమ్మతు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆక్వా రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో కీలకమైనందున, దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు, ఆక్వా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తగిన రక్షణ చర్యలు పాటిస్తూ పనులు చేపట్టాలని సీఎండీ ఆదేశించారు.

విద్యార్థులే నవ సమాజ నిర్మాతలు

వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 మంది విద్యార్థులకు ఉచితంగా స్టీల్ ప్లేట్లు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

విద్యార్థులే నవ సమాజ నిర్మాతలని, దేశ భవిష్యత్తు వారి భుజస్కంధాలపైనే ఆధారపడి ఉందని మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు.వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఒకటో డివిజన్ మున్సిపల్ పాఠశాలలో 75 మంది విద్యార్థులకు ఉచితంగా భోజన స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మోట మర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ బాల్యం ప్రతి ఒక్కరి జీవితంలో అమూల్యమైన దశ అని, విద్యార్థులే దేశానికి అసలైన సంపద అని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, సేవాభావం అలవర్చుకున్నప్పుడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వేమూరి చారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని ప్రశంసించారు.ట్రస్ట్ నిర్వాహకులు వేమూరి రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు దేశభక్తి, నైతిక విలువలు, మంచి అలవాట్లు నేర్పించడం ఎంతో అవసరమన్నారు. సమాజంలో అవసరమైన చోట సేవా కార్యక్రమాలు చేపడుతూ, నిరుపేదలకు అండగా నిలవడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజోపయోగ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా1వ డివిజన్ కార్పొరేటర్ గా ఎన్నిక కాబడిన వంపుగడల గీత్ చరణ్ ని వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు సత్కరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. మాధవి లత, వేమూరి రత్నగిరిరావు, మాటూరి రాజేష్, సమ్మెట రమేష్, డి. భాస్కర్ సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కార్తీక శోభతో విరాజిల్లిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధి

–ఒక్కరోజే రూ.9.53 లక్షల ఆదాయం

ప్రజాభూమి రీజినల్ రిపోర్టర్, మచిలీపట్నం:

కార్తీక మాస పవిత్రతతో, భక్తి పారవశ్యంతో సుబ్రహ్మణ్య స్వామి వారి సన్నిధి భక్తజన సందోహంతో కళకళలాడింది. మంగళవారం నాడు స్వామివారిని సుమారు 10,432 మంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీక రించి తరించారు.ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా రూ.2,50,395 ఆదాయం సమ కూరగా, వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.7,03, 340 ఆదాయం లభించింది. దీంతో ఒకేరోజు స్వామివారి ఆలయానికి మొత్తం రూ.9,53,735 ఆదాయం సమకూరింది. కార్తీక దీపాల వెలుగులు, హరహర మహాదేవ నామస్మరణలు, సుబ్రహ్మణ్య స్వామి నామజపాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రాకతో స్వామివారి సన్నిధి పండుగ వాతావరణాన్ని తలపించింది. భక్తుల విశ్వాసం, భక్తిభావం కార్తీక మాస వైభవానికి మరింత వన్నె తెచ్చాయి. ఓం శరవణభవ! అంటూ భక్తులు సుబ్రహ్మణ్య స్వామికి జయమంగళాలు! పలికి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.



Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

బుధవారం 11 నవంబర్ 2026

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలించిన రిజనల్ జాయింట్ కమిషనర్

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

దక్షిణ కాశీగా వీరాజల్లుతున్న ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి వారి దేవస్థానం నందు కార్తీక మాసం ఏర్పాట్లను రీజనల్ జాయింట్ కమిషనర్ వేండ్ర త్రినాధ రావు పర్యవేక్షించారు. ఈమేరకు మంగళవారం ఆయన భీమేశ్వరాలయం మనకి చేరుకుని ఎక్కడ ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ , కార్యనిర్వాహణాధికారిణి అల్లు దుర్గ భవానీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె జాయింట్ కమిషనర్ త్రినాధరావుకు ఆలయంలో జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లను తెలియజేశారు . సుదూర ప్రాంతాల నుండి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా



అన్ని సౌకర్యాలు కల్పించాలని తాగునీటి వసతి కల్పించాలని భక్తులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలని ఆలయ కార్యనిర్వాహణాధికారిణి దుర్గాభవానికి ఈసందర్భంగా రిజనల్ జాయింట్ కమీషనర్ తగు సూచనలు చేశారు.



భక్తి పరిమళాలతో వైభవంగా
కార్తీక నక్త దీక్ష మహోత్సవాలు

- రజిత కవచాలంకరణలో భ్రమరాంబ అమ్మవారు.. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో భక్తిపారవశ్యం

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

కార్తీక మాస పవిత్రతను చాటుతూ విజయవాడలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి దేవస్థానం (పాత శివాలయం)లో మంగళవారం కార్తీక నక్త దీక్ష మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు శ్రీ భ్రమరాంబ అమ్మవారిని రజిత కవచాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి త్రిశతి ఖడ్గమాల, సహస్రనామార్చనలు నిర్వహించారు. శ్రీ మల్లేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఇదే సందర్భంగా శ్రీ మల్లేశ్వర స్వామి, శ్రీ భ్రమరాంబ అమ్మవారు, శ్రీ అయ్యప్ప స్వామివారి సన్నిధిలో భక్తులకు మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం, ధర్మకర్తల మండలి చైర్మన్ ధనేకుల వెంకట సుబ్బారావు, అర్చకులు రాచకొండ నాగరాజుశర్మ, కె. మురళీధరన్ నంబూద్రి, కొత్తపల్లి సాయి కృష్ణశర్మ తదితరుల పర్యవేక్షణలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి.



ఓటమిని అంగీకరించలేక ఆరోపణలు చేస్తున్నారు



- ప్రజాస్వామ్య తీర్పును గౌరవించాలి: ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ యార్లగడ్డ అక్షిత

ప్రజా భూమి, ప్రత్తిపాడు

ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక ప్రత్యర్థులు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ యార్లగడ్డ అక్షిత విమర్శించారు. మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు బొద్దిరెడ్డి గోపి, మోదీ నారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి, స్థానిక నాయకుల ప్రోత్సాహంతో ప్రజలు తమను ఆదరించి గెలిపించారని తెలిపారు. చైర్‌పర్సన్ పదవిని కేవలం అధికారంగా కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతగా భావిస్తున్నానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఏలేశ్వరం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని అక్షిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు బొద్దిరెడ్డి గోపి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును, ప్రజాస్వామ్య తీర్పును అపహాస్యం చేస్తూ తమ గెలుపును వక్రీకరించడం సరికాదన్నారు. ఓటమిని అంగీకరించలేకే ప్రత్యర్థులు ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రభుత్వ అధికారుల సమక్షంలో, ఇరు పార్టీల బూత్ ఏజెంట్లు, కౌన్సిలర్ అభ్యర్థులు, చైర్‌పర్సన్ అభ్యర్థి సమక్షంలో పారదర్శకంగా జరిగిందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అక్రమాలు జరిగాయని నిరూపిస్తే ఎలాంటి ప్రమాణానికైనా సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ప్రజామోదం పొందిన విజేతలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యర్థులు తమ ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుని, రానున్న రోజుల్లో ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓంకార నాదంతో.. శివనామ స్మరణతో కార్తీక శోభ!

- తొలి వేకువ నుంచే ఆలయాలకు భక్తుల తాకిడి.. శివక్షేత్రాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



కార్తీక మాసం ఆరంభాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పవిత్రమైన పంచాక్షరీ మంత్రం 'ఓం నమః శివాయ' నామస్మరణతో భక్తజనం పరమేశ్వరుడిని కొలుస్తూ మాసారంభానికి భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. తెల్లవారుజామునే శివాలయాలకు చేరుకున్న భక్తులు దీపారాధనలు నిర్వహించి, అభిషేకాలు, అర్చనల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆగిరిపల్లి శోభనాచల గట్టుపై కొలువైన స్వయంభూ బ్రహ్మసూత్ర సహిత శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంతో పాటు, బస్టాండ్ సమీపంలోని శివాలయం, వరాహ పుష్కరిణి చెంతనున్న ముక్తేశ్వర స్వామి సన్నిధి, తోటపల్లిలోని బ్రహ్మలింగేశ్వర స్వామి క్షేత్రం, శోభనాపురం శివాలయం, ఈదులగూడెంలోని నాగేంద్ర స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ముఖ్యంగా మల్లికార్జున స్వామి వారి ఆలయం, గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి సన్నిధి, ముక్తేశ్వర క్షేత్రాల్లో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలోదకాభిషేకం, స్నపనాది క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పాలంకరణతో అలంకరించిన దైవమూర్తులను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక అర్చనలు, హారతుల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీక మాసపు తొలి రోజే శివనామ సంకీర్తనలు, ఆలయ ఘంటానాదాలు, భక్తుల హరహర మహాదేవ నినాదాలతో మండలమంతా ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది.



ప్రెస్ ఫోరమ్ భవన నిర్మాణానికి సహకరిస్తా

- రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు

నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న రెడ్డి అప్పలనాయుడును ది ఏలూరు ప్రెస్ ఫోరమ్ ప్రతినిధులు మంగళవారం సాయంత్రం జనసేన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ప్రెస్ ఫోరమ్ అధ్యక్షులు డి.వి. రమణ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఆయనకు శుభాకాంక్షలు తెలిపింది.ఈ సందర్భంగా ప్రెస్ ఫోరమ్ భవన నిర్మాణానికి మేయర్‌గా తన వంతు సహకారం అందించాలని డి.వి. రమణ కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన రెడ్డి అప్పలనాయుడు భవన నిర్మాణానికి తప్పనిసరిగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు, కోశాధికారి వై.వి. హరీష్, పీఆర్వో సంజయ్, కార్యదర్శి తోట వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు ఎస్. రుషి, ఏపీవీజేఎఫ్ అధ్యక్షులు ఎస్.డి. జబీర్ పాల్గొన్నారు.

జడ్పీటీసీ అనితమ్మకు ఘన సన్మానం

ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు



వాకాడు జడ్పీటీసీ సభ్యురాలిగా విజయం సాధించిన సన్నారెడ్డి అనితమ్మను టీడీపీ కార్యకర్త,సన్నారెడ్డి విజయ్ శేఖర్ రెడ్డి అనుచరుడు గాయం రమేష్ సతీమణి గాయం రమ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనితమ్మకు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. జడ్పీటీసీగా విజయం సాధించిన అనితమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమెను ఆత్మీయంగా సత్కరించారు.

సమగ్ర అభివృద్ధి, పోషకాహారం అందించడమే లక్ష్యం

- పోషణ్ భీ.. పఢాయి భీ పై శిక్షణ
- సిడిపిఓ వి.సునిత



ప్రజాభూమి, వేంపల్లె

చిన్నారుల సమగ్ర అభివృద్ధి, పోషకాహారం, ఆటపాటల ద్వారా విద్యా బోధన అందించడమే పోషణ్ భీ..పఢాయి భీ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వేంపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వి.సునిత అన్నారు. మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ..పఢాయి భీ కార్యక్రమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక దశలో పూర్వ ప్రాథమిక విద్యా, ఆరోగ్య సంరక్షణ, శారీరక, మానసిక వికాసం, ఎదుగుదల, వయసుకు తగిన అభ్యాసన పద్ధతులు, ఆటపాటలు, వివిధ కార్యక్రమాల ద్వారా విద్యా బోధన అందించేందుకు 2 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలు కేవలం ఆహార కేంద్రాలు కాకుండా పూర్వ ప్రాథమిక విద్యా నేర్పించే కేంద్రాలుగా మార్పు తీసుకురావాలని అంగన్వాడీ కార్యకర్తలకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ వెంకట్రామిరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు డా.స్వర్ణలత, సుభద్ర, హసినా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అమర వీరుల దినోత్సవం

- అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన అటవీ శాఖ అధికారులు



ప్రజాభూమి పోరుమామిళ్ల

కడప జిల్లా డీఎఫ్ఓ బాలరాజు ఐఎఫ్ఎస్ ఆదేశాలు మేరకు పోరుమామిళ్ల రేంజ్ అధికారి రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోరుమామిళ్ల రేంజ్ కార్యాలయంలో రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణ లో అమరులైన అటవీ అధికారులు కు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించడమైనది. ఈ సందర్భంగా రేంజ్ అధికారి రఘునాథ రెడ్డి మాట్లాడుతూ రాజమండ్రి కి చెందిన శ్రీనివాస్ ఐఎఫ్ఎస్ గంధపు చెక్కలు స్మగ్లర్ వీరప్పన్ చేతిలో హత్యకు గురికావడం బాధాకరం. వారి స్ఫూర్తిగా విధి నిర్వహణ లో నిజాయితీ గా ఉండాలని అలాగే మన ప్రాణాలు కాపాడుకోవలసిన బాధ్యత కూడా మనపై ఉంటుందని సిబ్బందికి పలుసూచనలు చేశారు. డాగ్ స్క్వాడ్ సింభ అమరవీరుల కు నివాళులు అర్పించడమైనది.ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు మరియు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు మూడు దఫాలుగా ఎన్నికల షెడ్యూల్ విడుదల

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలోని 544 గ్రామ పంచాయతీలకు నవంబర్, 15వ తేదీ నుండి డిసెంబర్ 3వ తేదీ వరకు 3 దశలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలోని 27 మండలాల్లోని 544 గ్రామ పంచాయతీలలలోని 5696 వార్డ్ మెంబర్లకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 5821 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మొదటి దశలో ఎన్నికలు నిర్వహించనున్న బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, టి. నర్సాపురం, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం మండలాలకు చెందిన 177 గ్రామ పంచాయతీలలో 1896 వార్డ్ మెంబర్లకు సంబంధించి 1953 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటికి రిటర్నింగ్ అధికారి ద్వారా నామినేషన్లు నిమిత్తం నవంబర్, 15వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, 17వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.18వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 19వ తేదీన అప్పీలు చేసుకోవచ్చని, 20వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని , అదే రోజు తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. నవంబర్,26వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో 27వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండవ దశలో ఎన్నికలు నిర్వహించనున్న భీమడోలు, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, నిడమర్రు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన 194 గ్రామ



పంచాయతీలలో 1972 వార్డ్ మెంబర్లకు సంబంధించి 2024 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటికి రిటర్నింగ్ అధికారి ద్వారా నామినేషన్లు నిమిత్తం నవంబర్, 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 21వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 22వ తేదీన అప్పీలు చేసుకోవచ్చని, 23వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, అదే రోజు తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. నవంబర్, 29వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో 30వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడవ దశలో ఎన్నికలు నిర్వహించనున్న దెందులూరు, ఏలూరు, పెదపాడు, పెదవేగి, అగిరిపల్లి, చాట్రాయి,, ముసునూరు, నూజివీడు మండలాలకు చెందిన 173 గ్రామ పంచాయతీలలో 1828 వార్డ్ మెంబర్లకు సంబంధించి 1844 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటికి రిటర్నింగ్ అధికారి ద్వారా నామినేషన్లు నిమిత్తం నవంబర్, 21వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని,, 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 24వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 25వ తేదీన అప్పీలు చేసుకోవచ్చని, 26వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని , అదే రోజు తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్, 2వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో డిసెంబర్, 3వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామని, గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి అన్ని అంశాలలో శిక్షణ అందించడం జరుగుతున్నదన్నారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు వీడియోలు చిత్రీకరించడం జరుగుతుందని, అంతేకాక సిసి కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు.

పేద పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే
సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం

మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

పేద పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విజయవాడలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ ను మంత్రి డిఎస్ బీవీ స్వామి మంగళవారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు. కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులను సౌకర్యాల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. పేద పిల్లలకు నాణ్యమైన ఉన్నత స్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యం అందించి వారిని ఉన్నత స్థాయిలో ఉంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.